# ప్రజాశక్తి

బుధవారం 24 జూలై 2024 · 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా


# ఆశాభంగం

- మిస్సైల్ లాంచింగ్ సెంటర్‌కు రిక్తహస్తం
- ప్రస్తావనలేని కోస్తా లింక్ రైలు మార్గం
- మెట్రో రైలు విస్మరణ
- పారిశ్రామిక కారిడార్ నిధులపై స్పష్టత నిల్




**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలకు సంబంధించిన పలు ప్రాజెక్టుల ప్రస్తావనలేకుండా పోయింది. ఇప్పటి వరకు బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని బడ్జెట్లలోనూ ఉమ్మడి కృష్ణాజిల్లాకు నిరాశే ఎదురైంది. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్లోనూ రిక్తహస్తం చూపారు. నాగాయలంక మండలం గుల్లలమోద గ్రామంలో మిస్సైల్ లాంచింగ్ సెంటర్ నిర్మాణానికి అవసరమైన నిధుల ప్రస్తావనలేదు. దీంతో గత రెండేళ్ల నుండి నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. మరోపక్క ఈ ప్రాజెక్టు గుజరాత్ తరలిపోతోందనే ప్రచారం సాగడం జిల్లా ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. అలాగే కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నం అనుసంధానంగా కోస్తా లింకు రైలు మార్గం ప్రతిపాదనలు ఆచరణకు నోచుకోదు. కాకినాడ – కోటిపల్లి, అమలాపురం, రాజోలు, నరసాపురం మీదుగా మచిలీపట్నం – రేపల్లె, నిజాంపట్నం–బాపట్ల వరకు లింకు మార్గం ఏర్పాటు చేయాల్సి ఉంది. 164 కిలోమీటర్ల దూరానికి రూ.3,484.54 కోట్లు వ్యయం అవుతుందని దశాబ్దాల క్రితమే అంచనా వేసి నివేదికలు సిద్ధం చేశారు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి డిపిఆర్ తయారీ చేయాలని కేంద్రం మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. కానీ డిపిఆర్ తయారీకి అవసరమైన రూ.150 కోట్లు నిధులను మాత్రం విడుదల చేయలేదు. తాజాగా బడ్జెట్లోనూ దీని ప్రస్తావ–నలేదు. విశాఖపట్నం – చెన్నై కోస్తా పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటించడం ఊరటనిస్తోంది. దీనిలో కృష్ణాజిల్లాలోని తీరప్రాంతం భాగంగా ఉంది. కానీ ఈ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు సంబంధించి ఎన్ని నిధులు ఖర్చు చేయనున్నారో ప్రకటించలేదు. గతంలో స్టేట్ హైవేగా ఉన్న మచిలీపట్నం, పెడన, గుడివాడ, హనుమాన్ జంక్షన్, నూజివీడు, తిరువూరు మండలం లక్ష్మీపురం వరకు ఉన్న రహదారిని జాతీయ రహదారి జాబితాలో చేర్చారు. నాలుగు జాతీయ రహదారులను కలుపుతూ సాగే ఈ రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసే పనులు ఇంకా ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. పామర్రు – చల్లపల్లి మధ్య మరో రహదారి అభివృద్ధిని పరిశీలించాలని గతంలోనే ఎంపి బాలశౌరి కేంద్రాన్ని కోరినా ఫలితంలేకుండా పోయింది. ఇక విభజన హామీల్లో భాగంగా విజయవాడ మెట్రో ప్రాజెక్టును ప్రస్తావించలేదు. దీంతోపాటు విజయవాడ నుండి రాజధాని అమరావతికి రైల్వే లింక్ మార్గాన్నీ విస్మరించింది.








## తీవ్ర అన్యాయం : విపక్ష నేతలు
## మేలు చేసే బడ్జెట్ : అధికారపక్షాలు

**ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ :**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందని విపక్షాల నేతలు విమర్శించారు. అభివృద్ధికి సూచికగా ఉందని టిడిపి నేతృత్వంలోని జనసేన, బిజెపి నేతలు అభిప్రాయపడ్డారు. బడ్జెట్ తీవ్ర అన్యాయం చేసిందని సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్ పార్టీల నేతలు తీవ్రంగా విమర్శించగా, జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్న ఎపికి కేంద్ర బడ్జెట్‌తో ఎంతో ఉపయోగం కలుగుతుందని టిడిపి, జనసేన, బిజెపి నేతలు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే.

**రాజధానికి నిధులు హర్షణీయం : విజయవాడ ఎంపి కేశినేని**

ప్రజాశక్తి – విజయవాడ : అమరావతి రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్ల సాయం ప్రకటించటం హర్షణీయం. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రధాని మోడీ నిలబెట్టుకున్నారు. ప్రపంచస్థాయిలో అమరావతి రాజధాని నిర్మాణం దిశగా అడుగులు పడడానికి ఉపకరిస్తుంది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కేంద్ర పథకాలు ఊతమిస్తాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంల మరోసారి స్పష్టంగా హామీ ఇవ్వడం శుభ పరిణామం. రాష్ట్రంలో పారిశ్రామిక రంగం పరుగులు పెడుతుంది.

**అభివృద్ధికి సూచిక : బందరు ఎంపి వి.బాలశౌరి**

అభివృద్ధికి సూచికగా ఉంది. రాష్ట్రానికి పెద్దపీట వేయడం హర్షణీయం. విశాఖ – చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేస్తామనడం అభినందనీయం.

**మౌలిక వసతుల కల్పనకు చోటు : టిడిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం**

రాజధాని నిర్మాణంతోపాటు మౌలిక వనరుల కల్పనకు పలు ఏజెన్సీల ద్వారా రూ.15 వేల కోట్లు సమకూర్చే బాధ్యతను కేంద్రం తీసుకుంది. రాజధాని నిర్మాణానికి గ్రాంట్‌గా ఈ మొత్తం ఇస్తే...మిగిలిన రాష్ట్రాలు కూడా అడిగే అవకాశం ఉంటుంది. అమరావతితోపాటు విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ రింగ్ రోడ్డు, ఇతర రహదారుల నిర్మాణానికి నిధుల కేటాయింపు జరిగింది.

**మోసం చేసింది : మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు వెల్లంపల్లి శ్రీనివాస్**

జిల్లా ప్రజలనే కాకుండా రాజధాని ప్రాంత ప్రజలను తీవ్రంగా మోసం చేసింది. మెట్రో, ఔటర్, ఇన్నర్ రింగ్ రోడ్లు, రాజధాని నిర్మాణానికి గ్రాంట్ల రూపంలో కాకుండా అప్పు ఇప్పిస్తామనడం అంటే నిధులు రాబట్టడంలో టిడిపి, జనసేన ప్రజాప్రతినిధులు ఘోరంగా విఫలమైనట్లుగా చెప్పవచ్చు.

**తీవ్ర అన్యాయం : సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ**

ప్రజలకు తీవ్ర అన్యాయం చేసింది. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నట్లు అంశాలను పూర్తిగా విస్మరించారు. మెట్రో రైలు ఊసే లేదు. అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్ల నిర్మాణాలకు నిధుల కేటాయింపు లేదు. రాజధానికి కూతవేటు దూరంలో ప్రధాన నగరంగా ఉన్న విజయవాడ అభివృద్ధికి ఒక్క పైసా కేటాయింపులేదు. రైల్వే జంక్షన్ అభివృద్ధి ప్రస్తావనలేదు. రాజధాని నిర్మాణానికి రూ.15 వేలు గ్రాంట్‌గా ఇవ్వకుండా రుణంగా ఇస్తే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినట్లే.

**తీవ్ర నిరాశ : సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు**

ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసింది. రాజధాని కనెక్టివిటీకి రైల్వే లైను ఊసే లేదు. రాజధాని నిర్మాణానికి గ్రాంట్ కాకుండా, ఏజెన్సీల ద్వారా అప్పులిప్పిస్తామని చెప్పడం సరికాదు. ఇది అప్పులు మీద ఆధారపడి ఈ రాష్ట్రాన్ని నడపమని కేంద్రం చెప్పడమే అవుతుంది.

**ఎంపిలు ఘోరంగా విఫలం :కాంగ్రెస్ విజయవాడ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసిహారావు**

రాజధానితోపాటు ఎన్‌టిఆర్ జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయింపు చేయడంలో టిడిపి, దాని మిత్రపక్షాల ఎంపిలతో పాటు వైసిపి ఎంపిలు కూడా విఫలం చెందారు. రైతులు, కార్మికుల సంక్షేమం, వారి అభివృద్ధి ఊసేలేదు.

**ఏమాత్రం ఉపశమనం కలిగించలేదు : ఐసిఇయు మచిలీపట్నం డివిజన్ కార్యదర్శి జి.కిషోర్ కుమార్**

ప్రజల జీవనానికి ఏమాత్రం ఉపశమనం కలిగించేవిగా ప్రతిపాదనలు లేవు. బీమా రంగం అభివద్ధికి ఏ విధమైన పన్ను రాయితీ, ప్రోత్సాహకాలు ఇవ్వలేదు. జీవిత బీమా, ఆరోగ్య బీమాలపై జిఎస్‌టిని తగ్గించే ప్రతిపాదన చేయకపోవడం వల్ల ప్రజల పొదుపుపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

**వ్యవసాయ రంగానికి నామమాత్రంగా నిధులు : ఎపి రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు**

వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు. వ్యవసాయ నిపుణులు, మేధావుల సూచనల ప్రకారం బడ్జెట్లో కనీసం 10 శాతం నిధులు కేటాయించాలి. రైతులు, కౌలు రైతులకు ఒక్కసారి రుణమాఫీ గురించి ప్రస్తావనలేదు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

## ఎన్‌టిఆర్ జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా



బాధ్యతలు స్వీకరిస్తున్న జెసి డాక్టర్ నిధి మీనా

**ప్రజాశక్తి - విజయవాడ :** జిల్లా సమగ్రాభివద్ధికి కషి చేస్తానని ఎన్‌టిఆర్ జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అన్నారు. ఈ జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నూతన జాయింట్ కలెక్టర్‌గా మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిధి మీనా మాట్లాడుతూ కీలకమైన ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. జిల్లా అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు కషి చేస్తానన్నారు. 2019 బ్యాచ్‌కు చెందిన నిధి మీనా గతంలో తెనాలి సబ్ కలెక్టర్‌గా, మిడ్ డే మీల్స్, స్కూల్స్ శానిటేషన్ డైరెక్టర్‌గా, వయోజన విద్య డైరెక్టర్‌గా పనిచేశారు. నూతన జాయింట్ కలెక్టర్‌కు డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్, జిల్లా పౌరసరఫరాల డీఎం

(మిగతా 2లో)

# ఎంపిడిఒ మృతిపై పూర్తి స్థాయి విచారణ

- కృష్ణాజిల్లా ఎస్‌పి గంగాధరరావు వెల్లడి
- వత్తిడితో ఆత్మహత్య
- కొన్ని మొబైల్ నెంబర్ల నుండి కాల్స్ వచ్చాయి





మృతదేహాన్ని వెలికితీస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు; శ్మశానవాటిక వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎలు బోడే ప్రసాద్, బొమ్మిడి నాయకర్ (కింద)

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :** పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం ఎంపిడిఒ మండవ వెంకట రమణారావు తీవ్ర వత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నారని కృష్ణాజిల్లా ఎస్‌పి ఆర్.గంగాధరరావు తెలిపారు. మచిలీపట్నంలోని పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాథమిక దర్యాప్తు మేరకు మాధవాయిపాలెం ఫెర్రీ విషయంలో రూ.55 లక్షల బకాయి విషయంలో తీవ్ర వొత్తిడికి గురైనట్లు తెలిసిందన్నారు. అంతేగాక ఆయనకు కొన్ని మొబైల్ నంబర్ల నుంచి కాల్స్ వచ్చాయని, ఆ కాల్స్ విషయంలోనూ తీవ్ర ఒత్తిడికి గురయ్యారని తెలిపారు. దీంతో కొంత డబ్బును కూడా ఆ కాలర్ల బ్యాంక్ అకౌంట్లలో జమ చేసినట్లు తెలిసిందన్నారు. వీటిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అదశ్యం కేసులో ఆత్మహత్యకు దారి తీసిన కారణాలు, గాలింపు చర్యలకు ఏఏ బందాలు ఏ విధంగా శ్రమించాయన్న విషయాలను ఆయన వెల్లడించారు. కష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరు మహదేవపురంలో నివాసం ఉంటున్న ఆయన ఈనెల 15న ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆయన... తనకు మచిలీపట్నంలో ఒక ముఖ్యమైన పని ఉందని, తాను వచ్చేసరికి కొంత ఆలస్యం కావచ్చుని భార్యకు చెప్పి ఎపి 39 డికె 2218 నెంబర్ గల స్కూటీపై ఇంటి నుంచి బయలుదేరి వెళ్లారు. మచిలీపట్నం రైల్వేస్టేషన్ నుండి కొండవీడు ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడకు టికెట్ ఎక్కారు. మధురానగర్ వద్ద రైలు దిగారు. అదేరోజు అర్ధరాత్రి సమయంలో తన చిన్న కుమారుడు మహిధర్‌కు వాట్సాప్ ద్వారా లెటర్ రాసిపెట్టి తనకు ఉద్యోగపరమైన ఇబ్బందులు ఉన్నాయని, అలాగే ఇతర సమస్యలు ఉన్నాయని తెలియజేస్తూ, తన కుమారుడితోపాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాసిన లెటర్‌ను వాట్సప్ ద్వారా షేర్

(మిగతా 2లో)

# షిల్టును తరలించాలి

## విఎంపి ఇన్ఛార్జి కమిషనర్ డాక్టర్ మహేష్

**ప్రజాశక్తి-విజయవాడ :** డ్రెయినేజీల్లో తీసిన షిల్టు, ఇతర వ్యర్థాలను వెంటనే అక్కడ నుంచి తరలించడానికి చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ ఎ మహేష్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన పలు ప్రాంతాలను పరిశీలించారు. లయోలా కాలేజీ రోడ్, ఎన్టీఆర్ కాలనీ రోడ్, భాను నగర్, కేదరాశ్వర్ పేట ప్రాంతాలలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా నాలుగో డివిజన్ లయోలా కాలేజ్ రోడ్డు దగ్గర తీసి ఉన్న షిల్టును గమనించి, మేజర్, మైనర్, మీడియం సైడ్ డ్రైనలో తీసిన షిల్టును అక్కడ నుంచి తరలించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఇన్‌చార్జి కమిషనర్ అన్నారు. ఎన్టీఆర్ కాలనీ రోడ్డు పర్యటించి అక్కడ రోడ్లపై నిలిచి ఉన్న వాహనాలను గమనించి రోడ్ల పైన ఎటువంటి వాహనాలు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలగకుండా వారి వారి పార్కింగ్ ప్రదేశాలలోనే వాహనాలు పార్క్ చేసేలా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. సెయింట్ జోన్స్ స్కూల్ ఎన్టీఆర్ కాలనీ దగ్గర అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పైప్ లీకేజ్ గమనించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.తదుపరి 28వ డివిజన్ భాను నగర్ లో ఉన్న జి వి ఎస్ శాస్త్రి పార్క్, పరిశీలించారు అక్కడ ఎండిపోయిన చెట్టును గమనించి వెంటనే ఆ చెట్టుని తీసేటట్టుగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ కి ఆదేశాలు ఇచ్చారు. అక్కడ పారిశుధ్యం మెరుగుపరచాలని వ్యర్థాలను వెంటనే తొలగించాలని సానిటరీ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. తదుపరి 34 డివిజన్, ఫ్రూట్ మార్కెట్, కేదారేశ్వరపేట పర్యటించి పబ్లిక్ టాయిలెట్స్, డ్రైన్లు, శానిటేషన్ మెరుగుపరచాలని అక్కడున్న ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకొనేటట్టుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య విభాగం ముఖ్యఅధికారి డాక్టర్ పి రత్నావళి, శానిటరీ ఇనిస్పెక్టర్లు పాల్గొన్నారు.



# ఎంపిడిఒ మృతిపై పూర్తిస్థాయి విచారణ

(మొదటి పేజీ తరువాయి)

చేశాడు. ఆ సమాచారం చూసిన వెంటనే చిన్న కుమారుడు తెల్లవారుజామున 3 గంటల సమయంలో పెనమలూరు పోలీస్‌స్టేషనోల ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసులు స్పందించి ఆయన కుమారుడు చెప్పిన సమాచారం ఆధారంగా ఒక బందాన్ని మచిలీపట్నం రైల్వేస్టేషన్‌కు పంపారు. అయితే 15వ తేదీ మధ్యాహ్నం 3.50 గంటల సమయంలో విజయవాడ వెళ్లడానికి రైల్వే టికెట్ తీసుకున్నట్లు సిసి కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. దీనిని ఆధారం చేసుకుని ప్రతి రైల్వేస్టేషన్లోనూ క్షుణ్ణంగా పరిశీలిస్తూ సెర్చ్ ఆపరేషన్‌ను కొనసాగించారు. మరో బందం ఆయన కాల్ వివరాలను, గూగుల్ మ్యాపింగ్‌ను అనుసరించి మధురానగర్ వద్ద దిగినట్లు, ఆ ప్రదేశంలో సంచరించినట్లు గుర్తించారు. అనంతరం ఆయన రెండో ఫోన్ 15వ తేదీ అర్ధరాత్రి చివరి యాక్టివిటీ ఏలూరు కాల్వ వద్ద గుర్తించారు. ఆయనకున్న వ్యక్తిగత కారణాల దష్ట్యా ఆత్మహత్య చేసుకోవచ్చేమో అనే అనుమానంతో ఏలూరు కాల్వ చుట్టుపక్కల ప్రాంతాలను ఎన్‌డిఆర్‌ఎఫ్ బందాల సహాయంతో గాలించారు. ఆయన బ్యాంక్ లావాదేవీల వివరాలను సేకరించారు. ఫోన్ కాల్స్‌నూ పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ సహకారంతో గుర్రపు డెక్కను తొలగించి గాలించారు. ఆక్టోపస్ నుంచి 2, పశ్చిమగోదావరి జిల్లా నుండి మూడు డ్రోన్ కెమెరాలు, కష్ణాజిల్లా నుండి మూడు డ్రోన్ కెమెరాలతో కాల్వ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఏలూరు కాల్వ వద్దకు పెనమలూరు సిఐ ఆధ్వర్యంలో ఒక బందం, హనుమాన్‌జంక్షన్ సిఐ ఆధ్వర్యంలో మరో బందం, ఏలూరు కాల్వ ప్రవాహం వైపు డిఎస్‌పి ఆధ్వర్యాన ఎన్‌డిఆర్‌ఎఫ్ బందం గాలించాయి. కేసు దర్యాప్తు, గాలింపు చర్యల్లో నలుగురు డిఎస్‌పిలు, నలుగురు సిఐలు, 15 మంది ఎస్‌ఐలు, 150 మంది సిబ్బంది పాల్గొన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) జి,వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి గంగాధరరావు

# జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

(మొదటి పేజీ తరువాయి)

జి.వెంకటేశ్వర్లు, డీఎస్‌వో జి.మోహన్‌బాబు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు, అడిషనల్ పీఆర్‌వో కె.రవి, ఏవీ సూపర్ వైజర్ వీవీ ప్రసాద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. నూతన జాయింట్ కలెక్టర్ నిధి మీనా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్ లోని వివిధ విభాగాలను పరిశీలించారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టర్ పి.సంపత్‌కుమార్; సమాచార శాఖ అధికారులు సురేంద్రనాథ్, మోహనరావు, రవి, ప్రనసాద్ తదితరులు (కింది ఫొటో)



# మురుగునీటి వ్యవస్థ మెరుగుదలకు నివేదిక

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)**

మచిలీపట్నం మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిచే సమగ్ర ప్రాజెక్టు నివేదికను త్వరగా సిద్ధం చేసి అందజేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఢిల్లీ ప్రతినిధులను కోరారు. ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర ప్రజా ఆరోగ్య పర్యావరణ ఇంజనీరింగ్ సంస్థ (సిపిహెచ్ఈఈఒ) ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని వారి చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మచిలీపట్నంలో మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు అవసరమైన ఇన్పుట్ వివరాలను అందజేశారు అంతేకాకుండా కొన్ని సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొద్దిపాటి వర్షానికి మచిలీపట్నం నగరమంతా మురికి కాలువలు పొంగి రాకపోకలకు చాలా ఇబ్బందికర వాతావరణ ఏర్పడుతుందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి నగరాన్ని పూర్తిగా అధ్యయనం చేసి సమగ్ర వరద నీటి కాలువల ప్రాజెక్టును వీలైనంత త్వరగా తయారుచేసి అందజేయాలన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో కూడా మురుగు నీటి వ్యవస్థ మెరుగుపరిచే విషయమై అధ్యయనం చేయాలని కలెక్టర్ వారికి సూచించారు.రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఆబ్కారి శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరిల ప్రత్యేక చొరవతో డాక్టర్ రమాకాంత్ నేతత్వంలోని కేంద్ర బందం మంగళవారం మచిలీపట్నం నగరంలో పర్యటించింది. ఈ బందం నగరం అంతా కలియతిరిగి మురుగు నీటి వ్యవస్థను పరిశీలించింది.ఈ పర్యటనలో కేంద్ర బృందం సభ్యులు డిప్యూటీ సలహాదారులు అరిత్రాదాస్, చీఫ్ ఇంజనీర్ ఆంజనేయులు, ఎస్ ఈ శ్రీనివాసులు, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, స్థానిక నాయకులు బండి రామకృష్ణ, బాబా ప్రసాద్, గోపీచంద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బృందంతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

## పరిశ్రమల స్థాపనకు భూముల కోసం ప్రతిపాదనలు

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పుటకు అవసరమైన భూముల అలినేషన్, ముటేషన్ చేయుటకు ప్రతిపాదనలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ చంద్రశేఖర రావుతో కలిసి రెవెన్యూ శాఖ, ఏపీఐఐసీ అధికారులతో సమావేశం నిర్వహించి భూముల అలినేషన్, ముటేషన్, 22ఎ తొలగింపులు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విరివిగా పరిశ్రమలు నెలకొల్పేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. చల్లపల్లి, వీరపనేనిగూడెం, మల్లవల్లి, గంగాధరపురం, గుడివాడ లలో పరిశ్రమలు నెలకొల్పేందుకు వీలుగా అవసరమైన భూములను సేకరించుట కోసం అలినేషన్, ముటేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే 22ఎ పరిధి నుండి భూములను తొలగించేందుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ ఆర్డిఓలు ఎం.వాణి పి.పద్మావతి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారామయ్య, డిజడ్ఎమ్ మధుసూదన్ తహసిల్దారులు పాల్గొన్నారు.

## ఆధార్ క్యాంప్ పరిశీలన

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** మండల కేంద్రమైన గుడ్లవల్లేరు సచివాలయం-2లో చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియను మంగళవారం ఎంపీడీవో నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ నమోదు ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. చిన్నారులకు తొలిసారిగా అందించే ఈ ఆధార్ వారి జీవితాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆధార్ నమోదు పత్రాన్ని ఎంపీడీవో లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏజేయల్ నరసింహారావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీల్లో ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి-మోపిదేవి:** మండలంలో వంగ, మిర్చి, టమోటా తదితర పంటలకు సంబంధించిన నారు పెంచి విక్రయించే నర్సరీలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అవనిగడ్డ ఉద్యానవన శాఖ అధికారి ఎన్ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మోపిదేవిలో కొనసాగుతున్న నర్సరీలను ఆయన ఆకస్మింగ తనిఖీ చేశారు. రైతుకి నారు విక్రయించేటప్పుడు బిల్లు తప్పనిసరిగా ఇవ్వటం చీడపీడలు లేనీ నాణ్యమైన నారు అందించడంతోపాటు పంట చేతికొచ్చే క్రమంలో తెగులును తట్టుకోగలిగే సామర్థ్యాలను రైతులకు వివరించాలన్నారు నర్సరీ పేరు యజమాని వివరాలు అందరికీ కనిపించేలా బయట ఉంచాలన్నారు ఎంపిక చేసిన నారు విత్తనాలకు సంబంధించి కంపెనీ బిల్లులు రిజిస్టర్లు తప్పనిసరిగా నర్సరీ యాజమాన్యం నిర్వహించాలన్నారు. నర్సరీ యాజమాన్యం ఉద్యానవన శాఖ దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోవడం సమయం అయిన తర్వాత రెన్యువల్ చేయించుకోవడం విధిగా పాటించాలన్నారు క్షేత్ర సహాయ సిబ్బంది వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



# ప్రతి ఇంటికీ ట్యాక్స్ అసెస్మెంట్ చేయాలి

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో ప్రతి ఇల్లు ట్యాక్స్ అసెస్మెంట్ చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ, వార్డు పంచాయతీ కార్యదర్శులు, పరిపాలన కార్యదర్శులతో జిల్లా కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పన్నుల వసూళ్లు, ట్యాక్స్ అసెస్మెంట్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీలు, ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో కొత్తగా నిర్మించిన గహాలకు పన్ను లెక్కించడంపై (టాక్స్ అసెస్మెంట్) రేపటి నుండి వారం రోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. కొత్తగా నిర్మించిన గహాలు, షాపింగ్ కాంప్లెక్స్ లు, అపార్ట్మెంట్లు గుర్తించడం, సరైన కొలతలు వేసి ఖచ్చితమైన పన్ను లెక్కించాలని, గ్రామపంచాయతీ మున్సిపాలిటీ వారీగా ఎన్ని గహాలకు పన్నులెక్కింపు చేశారు నివేదిక సమర్పించాలన్నారు. ఈ ప్రక్రియ ఆగస్టు 3 లోగా పూర్తి చేయాలని, ఆగస్టు 5న మరల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షిస్తామన్నారు. పన్ను లెక్కించిన గహాలను రాండం తనిఖీ చేపట్టడం జరుగుతుందని, ఇందుకోసం బందాలను ఏర్పాటు చేస్తామన్నారు. నూరు శాతం ప్రతి ఇల్లు పన్ను లెక్కింపు జరగాలన్నారు. గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలో ప్లాన్ లేకుండా అనధికారికంగా నిర్మాణాలను గుర్తించాలన్నారు. ఈ అంశం సీరియస్గా తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా అపార్ట్మెంట్లలో పన్నులెక్కింపు చేయునప్పుడు ప్రతి ఫ్లాట్ పన్ను లెక్కించాలన్నారు. కొలతలు కచ్చితంగా ఉండాలని, పన్ను లెక్కింపు ఖచ్చితంగా ఉండాలన్నారు. ఈ విషయంలో తప్పులు చేయవద్దని, రివిజన్ ఆఫ్ టాక్స్ కేసులు రాకుండా చూడాలని అన్నారు. ఇప్పటికే పన్ను లెక్కింపు జరిగిన వాటిని రీవెరిఫికేషన్ చేసి లెక్కించిన పన్ను కరెక్ట్ గా ఉందా పరిశీలన జరపాలన్నారు. బాగా పనిచేయాలని సూచిస్తూ, ఉత్తమ లక్ష్యాలు సాధించిన సిబ్బందిని అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

## ఉచిత శిక్షణా తరగతులను ప్రారంభించిన కలెక్టర్



**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ఎంతగానో ఉపకరిస్తుందని, ఉద్యోగులు ప్రతిఒక్కరు యోగా శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని జడ్పీ కన్వెన్షన్ హాలులో జిల్లా కలెక్టర్ చొరవతో తొలిసారిగా జిల్లా అధికారులు, ఉద్యోగులకు ఉచిత ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించి యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ యోగా శిక్షణా తరగతుల్లో స్వయంగా పాల్గొని మాట్లాడుతూ పూర్వము అందరూ మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్య నియమాలు పాటించేవారని ఎంతో ఆరోగ్యంగా ఉండే వారన్నారు. నేడు పర్యావరణం చాలా కలుషితమైందని మన జీవనశైలిలో కూడా చాలా మార్పులు వచ్చాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జీవనశైలిలో యోగాను అలవర్చుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు.యోగ వేరే ఎవరికోసమో కాదని మనం మన ఆరోగ్యం కోసమే నేర్చుకోవాలన్నారు. ఉద్యోగులు ఎన్నో ఒత్తిళ్లకు గురవుతుంటారని, యోగా అభ్యసించడం వల్ల వారికి మానసిక ప్రశాంతత లభించి చురుగ్గా ఉద్యోగ జీవితం లో పనులు చేయగలుగుతారన్నారు.ఆ దిశగా జిల్లా అధికారులు, ఉద్యోగుల కోసం ప్రత్యేకించి ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. ఏ పనైనా 21 రోజులు వరుసగా చేస్తే అది ఒక అలవాటుగా మారిపోతుందన్నారు. ఈ తరగతులు ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు జరుగుతాయని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. తద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవడానికి కషి చేద్దామన్నారు.యోగా గురువు ముదిగొండ శాస్త్రి మాట్లాడుతూ యోగా ఒక ఆధ్యాత్మిక విజ్ఞాన శాస్త్రమని, మనసు శరీరాలను ఐక్యం చేసే ఒక గొప్ప ప్రక్రియ అన్నారు. ఎక్కడా లేనివిధంగా జిల్లాలో ఇప్పటికే 5 శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నామని, జిల్లా కలెక్టర్ నేతత్వంలో 6 వ కేంద్రాన్ని జడ్పీ కన్వెన్షన్ హాల్లో ప్రారంభించుకున్నామన్నారు.అంతకు మునుపు యోగ గురువులు మద్దాల చింతయ్య, శీలం రమేష్, రేఖ జిల్లా అధికారులు, ఉద్యోగులకు ఛాలన క్రియలు, వజ్రాసనం, కపాల భాతి, నాడీ శోధన, ప్రాణాయామం, ధ్యానం వంటి యోగా ప్రక్రియలను నేర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, క్రీడల చీఫ్ కోచ్ ఝాన్సీ లక్ష్మి, విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు, సమాచార పౌర సంబంధాల శాఖ డిడి యమ్. వెంకటేశ్వర ప్రసాద్, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఇసుక లారీలు స్వాధీనం

**ప్రజాశక్తి.చల్లపల్లి :** ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మొవ్వ ఎస్ఇబి సిఐ వి.శివరామరాజు స్పష్టం చేశారు. సోమవారం అర్ధరాత్రి చల్లపల్లి మండలం నుంచి రెండు టెన్ టైర్ లారీల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావటంతో ఎస్ఈబీ ఎస్ఐ పీ.హేమ సుష్మిత, సిబ్బంది కలిసి చల్లపల్లి బైపాస్ రోడ్డులో రూట్ వాచ్ నిర్వహించి అడ్డుకున్నట్లు తెలిపారు. ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆ రెండు లారీలను సీజ్ చేసి, ఒక్కొక్క లారీకి రూ.25 వేలు చొప్పున మొత్తం రూ.50 వేలు జరిమానా విధించినట్లు సీఐ శివరామరాజు వివరించారు.





## అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి



**ప్రజాశక్తి-మొవ్వ:** మొవ్వ మండలం అయ్యంకి గ్రామానికి చెందిన రాజులపాటి రామకృష్ణ (32) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అయ్యంకి - కారకంపాడు రహదారి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని మరణించాడు. హత్య చేసి చెట్టుకు ఉరి వేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కూచిపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి-గన్నవరం:** చెన్నై-కోల్కతా జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు లారీలు ఢీకొనడంతో ఒక కారు ధ్వంసం అయింది. ఇరువురు స్వల్ప గాయాలకు గురయ్యారు. విజయవాడ వైపు నుంచి గన్నవరం వస్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు ఢీకొట్టింది. ఇదే సమయంలో కారు వెనుక వస్తున్న లారీ అదుపుతప్పి కారు వెనుక భాగాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## ఎస్సి బాలుర వసతి గృహం పరిశీలన

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** అవనిగడ్డలోని ఎస్సి బాలుర వసతి గృహాన్ని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ పరిశీలించారు. సోమవారం రాత్రి వసతి గృహం వద్దకు వెళ్లి అందులో విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. 80 మంది విద్యార్థులు ఉన్నారని వీరికి అందిస్తున్న సదుపాయాలు ప్రభుత్వం అందజేస్తున్న మెనూ పరిశీలించారు. అక్కడ విద్యార్థులకు అందిస్తున్న ఆహారం సంతృప్తికరంగా ఉన్నదని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అదేవిధంగా హాస్టల్ పరిసరాలను పరిశీలించారు.



## సూపర్ బజార్లో తనిఖీలు

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** సరసమైన ధరలకే నాణ్యమైన సరుకులు అందించాలని మచిలీపట్నం డివిజన్ తూనికల కొలతల ఇన్స్పెక్టర్ ఎన్ ఈశ్వరరావు సూచించారు. మంగళవారం అవనిగడ్డలోని మోర్ సూపర్ బజార్లో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను దివి వినియోగదారుల పరిరక్షణ మండలి అధ్యక్షుడు లకనం నాగాంజనేయులుతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కాకుండా హెచ్చు ధరలకు ఆహార పదార్థాలు అమ్మిన తూనికల కొలతల్లో మోసాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిపిటి స్టీమ్ రైస్ 49 రూపాయలకు సోనా మసోరియా బియ్యం 48 రూపాయలకు దేశవాళీ కందిపప్పు 160 రూపాయలకు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోర్ సూపర్ బజార్ మేనేజర్ పి.రమేష్ పాల్గొన్నారు.



## దుర్గమ్మకు సారె

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని సన్యాసి వీధిలో మహిళలు ఆషాడ మాసం సందర్భంగా మంగళవారం కనకదుర్గ అమ్మవారికి ఆషాడం సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో 52 డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వర రావు (చంటి) సతీసమేతంగా పాల్గొన్నారు.

## పూడిక తీత పనులు



**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** పశ్చిమ నియోజకవర్గంలోని గాంధీహిల్ ఔట్‌ఫాల్ డ్రెయిన్ పూడిక తీత పనులను మంగళవారం కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీ ప్రాంభించారు. సర్కిల్ -1 ఇఇ ప్రసాద్, ఎఎం ఒహెచ్ ఎల్.సురేష్, 53వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, 54వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావుతో కలిసి పూడిక తీత పనులను కార్పొరేటర్ పరిశీలించారు. సుమారు రూ.9 లక్షల వ్యయంతో గాంధీ హిల్ నుండి వెహికల్ డిపో వరకు మధ్య రైల్వేస్టేషన్ ప్లాటుఫామ్‌ల కింద ఉన్న కాలువల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు అప్పాజీ తెలిపారు.

## బోనాల వేడుక

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** పశ్చిమ నియోజకవర్గంలోని స్థానిక 46వ డివిజన్‌లోని శ్రీ ముత్యాలమ్మ, శ్రీ కనకదుర్గ అమ్మవార్ల దేవస్థానంలో లంబాడి పేట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శీత్లా భవాని బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దేవాత్ మురళి నాయక్, రవీంద్ర నాయక్, లంబాడి పేట కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** కెఎల్‌రావ్ నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ డా. ఎన్.వి.రావ్ జన్మదినం సందర్భంగా మంగళవారం పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. రాకేష్ సర్వీస్ సొసైటీ, అధ్యక్షులు పొత్తూరి రాధాకృష్ణమూర్తి, రూ.40 వేలు స్కాలర్‌షిప్‌ల రూపంలో విద్యార్థులకు అందజేశారు. కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు రాధాకష్ణమూర్తిని అభినందించారు. అనంతరం విద్యార్థులు బాగా చదువుకొని ఇంకా ఉన్నత స్థితికి రావాలని ఆర్థిక వెనుక బాటుతనం సమస్య కాదని, మెరిట్ ఉన్న విద్యార్థులకు దాతలు సహకారం అందుతుందని రాధాకృష్ణమూర్తి అన్నారు. ఈ సందర్భంగా ఎన్.వి.రావు మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేశారు.

## పరిశుభ్రతతో వ్యాధుల నియంత్రణ



రక్తనమూనాలు సేకరిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - తిరువూరు :** పరిశుభ్రతతో వ్యాధులను నియంత్రణ వర్షా కాలంలో సాధారణంగా వ్యాపించే వ్యాధులు నియంత్రణకు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమని తిరువూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రేష్మ బేగం అన్నారు. తిరు వూరులోని వివిధ వార్డుల పరిధిలోని వార్డ్ హెల్త్ సెక్రటరీలు సమగ్ర మలేరియా సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులనుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రక్త నమూనాలను సేకరించారు. ఈగలు వాలకుండా ఆహార పదార్థాలను జాగ్రత్త చేయడంతో పాటు వేడి ఆహారాన్ని భుజించాలని హెల్త్ సెక్రటరీలు సూచించారు. జలుబు దగ్గు జ్వరం బారిన పడినప్పుడు సొంత వైద్యం నాటు వైద్యం చేయించుకోకుండా ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకో వాలని రేష్మా బేగం తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కె.రవి, హెల్త్ విజిటర్ ఎస్.కె ఆషాబీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన సుజనా

**ప్రజాశక్తి - భవానీపురం :** రాష్ట్ర గవర్నర్ జనాబ్ అబ్దుల్ నజీర్ని రాజ్ భవన్‌లో పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు సుజనా చౌదరి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి గవర్నర్ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గవర్నర్‌కు గాంధీ పుస్తకాన్ని అందజేశారు.

# విద్యుత్ భారాలు తొలగించాలి




**ప్రజాశక్తి - విజయవాడ :** విద్యుత్ రంగంలో గత ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను తొలగించాలని టాక్స్ పేయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక బెల్లపు శోభనాద్రి గ్రంథాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో అసియేషన్ నగర కార్యదర్శి ఎంవి ఆంజనేయులు మాట్లాడారు. టారీఫ్‌లు పెంచటం ద్వారా రు.16,699కోట్లు, ట్రూ అప్ చార్జీల ద్వారా రు 3977 కోట్లు, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో రు.5886 కోట్లు, విద్యుత్ సుంకంపేరుతో 5604కోట్లు మొత్తం రూ.32,166 కోట్లు గత ప్రభుత్వం ప్రజలపై భారాలను మోపిందని అన్నారు. ఈ నెల (జులై)8 వతేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి విడుదల చేసిన శ్వేతపత్రం ద్వారా వెల్లడించారు. ఇది కాకుండా మరో రు.17,137 కోట్లు ట్రూఅప్ ఛార్జీలు సిద్ధంగా ఉన్నాయని శ్వేతపత్రం ద్వారా వెల్లడించారన్నారు. 'ఇవన్నీ గత ప్రభుత్వం చేసిన తప్పులు' అని ప్రస్తుత ప్రభుత్వం గుర్తించిందన్నారు. తప్పు అని గుర్తించినపుడు, ఆ తప్పు మరల జరగకుండా చూడవలసిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉన్నదని టాక్స్ పేయర్స్ అసోసియేషన్ భావిస్తుందన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలను తగ్గిస్తామని తెలుగుదేశం నాయత్వంలోని కూటమి ఎన్నికలలో వాగ్దానం చేసి ప్రజల ఓట్లు పొందగలిందన్నారు. తమపై భారాలు తొలగిస్తారని ప్రజలు ఆకాంక్షించటం సహజమన్నారు. విద్యుత్ టారీఫ్‌ను రద్దు, ఈ ట్రూఅప్ ఛార్జీలను, ఇంధన సర్దుబాటు చార్జీల రద్దు, ట్రూ అప్ చార్జీల మొత్తాలను ఇక మీదట వచ్చే విద్యుత్ బిల్లులకు జమచేయాలని అన్నారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను పెట్టడానికి షిర్డీసాయి లాంటి కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నది. కొన్ని చోట్ల వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లను బిగించారన్నారు. వాటిని రైతులు వ్యతిరేకించారు. నివాస గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లను పెట్టడానికి నాటి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించిందన్నారు. తెలుగుదేశం కూడా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకింది. విద్యుత్‌కు స్మార్ట్ మీటర్లను బిగించటానికి ప్రారంభించిన చర్యలను నిలిపి వేయాలని కోరారు. టారీఫ్‌ల పెంపు, ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు – ఇవన్నీ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న ప్రైవేటు కంపెనీలు అధిక లాభాలకోసం చేసిన డిమాండ్ల ఫలితమేనని టాక్స్ పేయర్స్ అసోసియేషన్ స్పష్టం చేస్తున్నదన్నారు. రాష్ట్ర అభివద్ధికి ఉపయోగపడుతుంది. రాష్ట్ర అవసరాలకు సరిపడా విద్యుదుత్పతి సంస్థలను రాష్ట్ర పభుత్వమే ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న వి.టి.పి.ఎస్ లాంటి ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి సంస్థలను పూర్తి స్థాయి పని చేయించి వాటి పూర్తి సామర్ధ్యాన్ని వినియోగించాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు సాంబిరెడ్డి పాల్గొన్నారు.

## అమరావతి రైతులు కష్టం మరవలేనిది : సుజనా

**ప్రజాశక్తి - భవానీపురం :** గడిచిన ఐదేళ్ల కాలంలో అమరావతి రైతులు ఎంతో కష్టపడ్డారని, వారి ఆవేదనను తాను ప్రత్యక్షంగా చూశానని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రసంగించారు. న్యాయస్థానాల చుట్టూ తిరిగి, దేశ రాజధాని ఢిల్లీలో అమరావతిలో జరిగిన అభివద్ధి గురించి చాటి చెప్పిన నాటి రైతుల గొంతును వినిపించకుండా అప్పటి అధికార పార్టీ నేతలు మీడియా వ్యవస్థలను దొడ్డిదారిన మేనేజ్ చేసి అభివృద్ధి జరగలేదని చెప్పేవారని సుజనా చౌదరి గుర్తు చేశారు.

## పంటల బీమా ఇవ్వాలని వినతి



**ప్రజాశక్తి - తిరువూరు :** గడిచిన ఖరీఫ్ లో కరువు, తుఫాన్లతో నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారాన్ని తక్షణమే రైతులు, కౌలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో మునకుళ్ళ సచివాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.20 వేలు రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తానని హామీ ఇచ్చారని, కానీ ఖరీఫ్ పనులు ప్రారంభం అయినా రైతులు, కౌలు రైతుల ఖాతాల్లో జమచేయక పోవటంతో వ్యవసాయానికి పెట్టుబడి కోసం రైతులు రుణగ్రస్తులపై ఆధార పడాల్సి వచ్చిందని అవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికి వారి గుర్తింపు కార్డులకు భూయజమాని సంతకం తప్పనిసరి చేయడం దుర్మార్గమని అన్నారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వం కౌలుగుర్తింపు కార్డులివ్వాలని అయన డిమాండ్ చేశారు. క్రమంలో రైతుసంఘం నాయకులు తాళ్లూరు ఉద్దండు తదితరులు పాల్గొన్నారు.

## దోమల మందు పిచికారీ



**ప్రజాశక్తి - కంచికచర్ల :** వర్షాకాలంలో దోమల వల్ల అంటురోగాలు ప్రబలకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల మందు (ఫాగింగ్) పిచికారి చేశారు. ఇటీవల వారం రోజులుగా వర్షాలు కురిసి, దోమలు ఉధృతి చెందాయి. దోమల కాటు వల్ల అంటురోగాలు ప్రబలే అవకాశం ఉన్న విషయం తెలిసిందే. దీంతో దోమల నివారణకు మంగళవారం గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఫాగింగ్ మిషన్‌తో కంచికచర్లలోని జాతీయ రహదారి, జుజ్జూరు రోడ్డు, గొట్టుముక్కల రోడ్డ పలు కాలనీల్లో పంచాయతీ సిబ్బంది దోమల మందు (ఫాగింగ్) పిచికారి చేశారు. పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో సిబ్బంది ఇల్లా సుబ్బారావు, శానిటరీ సిబ్బంది బెజ్జం భూషణం అన్ని ప్రాంతాల్లో తిరిగి దోమల మందు పిచికారి చేయించారు.

## ప్రజారోగ్యం అందరి కర్తవ్యం

### 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** పరిశుభ్రమైన మంచినీరు పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ అనే విషయాలపై నగరపాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బంది మంగళవారం 50వ డివిజన్ ఆర్‌సిఎం స్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రజారోగ్యం పరిశుభ్రత దోమల నివారణ చర్యలు చేపట్టే అంశంలో అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఇంటి పరిసరాల్లో పరిశీలించి నిలవ నీటిని తొలగించి దోమలు నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ వన్ శానిటరీ సూపర్వైజర్ ఓబేశ్వ రావు, మలేరియా సెక్షన్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సెంట్రి ఇన్ స్పెక్టర్ ఎం.రవి కుమార్, ఆది నారాయణ. ఆర్.సి. యం స్కూల్ ప్రిన్సిపల్, శానిటరీ సెక్రెటరీస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోయి సత్యబాబు

## విద్యాశాఖ మంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : గాయత్రి

**ఇబ్రహీంపట్నం :** అసెంబ్లీలో ఆర్ట్స్, క్రాఫ్ట్ విద్యను ప్రోత్సహిస్తామని లోకేష్ ప్రకటనపై ఏపీ వర్క్,ఆర్ట్ అండ్ పిఇటి ఇన్‌స్ట్రక్టర్స్ జిల్లా అధ్యక్షులు నిశ్శంకర గాయత్రి హర్షం వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా పాఠశాల్లో ఆర్ట్స్, క్రాఫ్ట్ విద్యను ప్రోత్సహిస్తామని ప్రకటన చేయడం పట్ల వర్క్, ఆర్ట్, అండ్ పిఇటి ఇన్‌స్ట్రక్చర్స్ రాష్ట్ర యూనిటీ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది.

## 25న మినీ జాబ్ మేళా..!

**ప్రజాశక్తి - విజయవాడ :** గురువారం జిల్లా కార్యాలయంలో జాబ్ మేళా (ఐటిఐ కాలేజీ వెనుక) ఉపాధి కల్పన శాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మినీ బాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాను ఉమ్మడి కృష్ణా జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు. మెడ్ ప్లస్, టైమ్స్ ప్రో, జీనియస్, ధృవంత సొల్యూషన్స్, మీకవెల్, ఓజోన్ సెక్యూరిటీ, కంపెనీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టుగా తెలిపారు. జిల్లాలోని పదో తరగతి ఐటిఐ డిప్లమా, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు నిరుద్యోగుల పూర్తి బయోడేటా ధృవ పత్రాలు జిరాక్స్ కాపీలు ఆధార్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు 8142416211 (వాట్సప్)కు సంప్రదించవచ్చని తెలిపారు.

## సోనీ ఇండియా నుంచి బ్రావియా 3 టెలివిజన్ సిరీస్

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ టెక్నాలజీలో గణనీయమైన ముందడుగు వేస్తూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బ్రావియా 3 సిరీస్ టెలివిజన్‌లను విడుదల చేసినట్లు సోనీ ఇండియా రీజనల్ ఇంఛార్జి ఎస్.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. వీక్షణ అనుభవాన్ని పునర్నిర్వచించటానికి రూపొందించ బడిందన్నారు. టివి సిరీస్ 43, 50, 55, 65, 75, 85 అంగుళాల సైజులో అందుబాటులో ఉందని తెలిపారు. ఈ మోడల్‌లు అన్ని సోనీ సెంటర్‌లు, ప్రధాన ఎలక్ట్రానిక్ స్టోర్‌లు, ఇ-కామర్స్ పోర్టల్‌లలో అందుబాటులో ఉంటాయన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

**ప్రజాశక్తి - తిరువూరు :** వర్షా కాలంలో సాధారణంగా బాక్టీరియా, వైరస్ తదితర సూక్ష్మ జీవుల వల్ల టైఫాయిడ్, డెంగీ వంటి వివిధ రకాల జ్వరాలు వస్తాయని, పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసు కోవడం వల్ల చాలా రకాల సీజనల్ వ్యాధులను నియంత్రణ చేయవచ్చని తిరువూరు శ్రీరామకష్ణ పిల్లల ఆసు పత్రి నిర్వాహకులు డా.ఎన్.వివేకానంద తెలిపారు. సోమవారం రాత్రి సీజనల్ వ్యాధుల నియంత్రణపై పిల్లల ఆసుపత్రి సౌజన్యంతో జనవిజ్ఞానవేదిక రూపొందించిన కరపత్రాలను ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. దోమలు, ఈగల వల్ల కూడా పలు రకాల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్, నాయకులు ఎం.హరికృష్ణ, ఎం.రాంప్రదీప్, ఎం.సుధాకర్, డి.సుదర్శన్ కె.పాపారావు, పి.శీనయ్య, జి.సురేంద్ర నాథ్ తదితరులు పాల్గొన్నారు.



# ముమ్మరంగా వరినాట్లు

**ప్రజాశక్తి-గన్నవరం:** మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, వాగుల్లో నీరు చేరింది. ఏలూరు కాల్వకు కష్ణా నీరు విడుదల చేశారు. మెట్టలో పోలవరం కాలువ నీరు వస్తుంది. దీనికి తోడు వాసలు వరుసగా పడటంతో పొలాల్లో నీరు చేరింది. దీంతో రైతుల ఆశలకు ఊపిరి పోసినట్టైంది. మొన్నటి వరకు ఎండలు తీవ్రంగా కాయడంతో నీరు లేక రైతులు వరి నార్లు పోయడానికి ఆలోచించారు. వర్షాలు పడితేనే సాగు జరుగుతుందని చెప్పారు. ఈనేప ధ్యంలో ప్రభుత్వం కాలువలకు నీరు విడుదల చేశారు. మరో వైపు ప్రకతీ కరుణించి వర్షాలు పడుతున్నా యి. దీంతో పొలాల్లో నీరు చేరుతుంది. నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గన్నవరం మండలంలో 17 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. అన్నీ అనుకూలిస్తే పంట చేతికి వస్తుంది. రెండే ళ్లుగా వరి పైరు రైతుల ఇళ్లకు చేరుతుంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంతో ఆర్థిక ఇబ్బందుల నుండి కొంత వరకుబయ టపడ్డారు. అయితే చివర్లో కొనుగోలు చేసిన ధాన్యానికి బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు నానా అగచా ట్లు పడ్డారు. ఈసారి పరిస్థితులు అనుకూలంగా ఉంటాయనే ఆశతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వాన రైతుల్లో ఉత్సాహం నింపింది. గన్నవరంలో 119 మిల్లీ మీటర్ల వర్షపాత్న నమోదైంది. మిగిలిన గ్రామాల్లో 90 మీల్లి మీటర్ల నుండి 102 మిల్లీ మీటర్ల వరకు నమోదైంది. వానలు కురియడం వల్ల నాట్లు వేయడానికి వీలుందని తెలిపారు. ఇప్పటికే పోసిన నార్లు పీకి నాట్లకు తీసుకెళ్తున్నారు. పొలాలను దమ్ము చేస్తున్నారు. ఏలూరు కాలువ కింద నీరు రావడంతో ఈనెల రెండవ వారం నుండి నాట్లు వేగంగా పడుతున్నాయి. కాల్వ నీరు పంట పొలాలకు ఎక్కడం లేదని, ఇంజన్లతో పంట కాల్వలకు నీరు మళ్లించాల్సి వస్తుందని తెలిపారు. అందుకు ఎకరాకు రూ.వెయ్యి ఖర్చు అవుతుందని చెప్పారు. పోలవరం నీరు చెరువులకు మళ్లిస్తున్నారు. నాట్లు వేయడం చేపట్టారు. కూలీలకు చేతినిండా పనులులభిస్తున్నాయి. అందరూ బిజీగా ఉన్నారు. గొల్లనపల్లి, బిబిగూడెం, గోపవరప గూడెం, ముస్తాబాద్, సావరగూడెం, కేసరపల్లి, అల్లాపురం, దావాజిగూడెం ఏరియాల్లో రైతులు వరినాట్లు వేస్తున్నారు. మెట్ట ఏరియాలో పురుషోత్తపట్నం, విఎన్ పురం, సూరంపల్లి, కొండపావులూరు ఏరియాల్లో నాట్లకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయ పనులు ఒక్కసారిగా రావడంతో కూలీలకు చేతి నిండా పనులు లభిస్తున్నాయి.



## ఉపాధి కార్మికుల వినతి

**ప్రజాశక్తి-మొవ్వ:** తమ సమస్యలు పరిష్కరించాలని మొవ్వ మండలం కాజ గ్రామంలోని సచివాలయ కార్యదర్శి ప్రసాద్‌కు ఉపాధి హామీ కార్మికులు మంగళవారం అర్జీ అందజేశారు. వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, బకాయిలు వెంటనే ఇప్పించాలని కోరారు. కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 200 పని దినాలు కల్పించాలని, ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయరాదని, చేసిన పని దినాలకు పే స్లిప్పులు ఇవ్వాలని, గ్రామపంచాయతీ ప్రతిపాదించిన ప్రతి పనిని ఆమోదించి పని చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ కొడాలి కరుణాకర్‌రావు, చెరుమూరు వాసు, గణపతి పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

**ప్రజాశక్తి-చల్లపల్లి**

ప్రతి ఒక్కరూ ఈ వర్షాకాలంలో తమ నివాస గహ ప్రాంగణంలో ఒక మొక్క నాటి పెంచాలని స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్ కోరారు. మంగళవారం చల్లపల్లిలోని సాయినగర్-గంగులవారిపాలెం ప్రధాన రహదారిలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు, సాయి నగర్ వాసులు కలసి మొక్కలు నాటారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో విస్తతంగా మొక్కలు నాటి పెంచాలని కోరారు. తద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ టీ.పద్మావతి, స్వచ్ఛ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బందరు పోర్టు నిర్మాణం వేగవంతం : కలెక్టర్

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, పోర్టు కనెక్టివిటీ రైలు రోడ్డు మార్గాల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పోర్టు, మేరీ టైం బోర్డు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టు అభివద్ధి పనుల్లో భాగంగా పోర్టు కనెక్టివిటీ రైల్ రోడ్డు మార్గాల ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ సమస్యలపై సమీక్షించారు.ఈ సమావేశంలో కలెక్టర్ బందరు పోర్టు నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. పనులు వేగవంతం గావించాలన్నారు. ముఖ్యంగా బందరు పోర్టు కనెక్టివిటీ రైలు రోడ్డు మార్గాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో సమస్యలు పరిష్కరించేందుకు తీసుకోవలసిన చర్యలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. తదుపరి ఎలాంటి లీగల్ సమస్యలు రాకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయాలని, అనంతరం డ్రాఫ్ట్ డిక్లరేషన్ జారీ చేయాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఏవైనా కోర్టు



కేసులు పెడితే అడ్మిషన్ టైంలోనే నిబంధనలు సంపూర్ణంగా కోర్టుకు సమర్పించి త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.తొలుత గత సమావేశపు మినిట్స్ అంశాల వారిగా తీసుకున్న చర్య నివేదికలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, పోర్టు ఎండి ప్రతాపరెడ్డి, మ్యారీ టైం బోర్డు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్రావు, మెరైన్ డివిజన్ డిఈఈ ఎం. శివయ్య, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపర్నెంట్ తేజేశ్వరరావు, తాసిల్దారు వెంకటేశ్వరరావు, పోర్టు డిపిఆర్‌కు సంబంధించి రైట్స్ ప్రతినిధులు విశ్వనాథన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దమ్ము చక్రాలతో రహదారులు ధ్వంసం

**ప్రజాశక్తి-చల్లపల్లి:** దమ్ము చక్రాల ట్రాక్టర్లు గ్రామీణ రహదారులను ధ్వంసం చేస్తున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు నిర్మాణం చేస్తే దమ్ము ట్రాక్టర్ల పుణ్యమా అని రహదారులు విచ్చన్న మౌతున్నాయని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాలకులు సంబంధించిన అధికారుల



నిర్లక్ష్యం వలననే నిబ్బందులకు విరుద్ధంగా రోడ్లపై దమ్ము చక్ర ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు చల్లపల్లి మండలం కొత్తమాజేరులో దమ్ము చక్రాల ట్రాక్టర్ల డ్రైవర్లు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం దమ్ము చక్రాలతో రోడ్లపై ప్రయాణం చేయాలంటే ఇనుప రింగు బద్ది తొడగాలి. కానీ రింగ్ లేకుండా ప్రయాణిస్తున్న ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. అధికారులు స్పందించి ఇలాంటి వారిపై చర్యలు తీసుకొని రోడ్ల మనుగడ కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కేంద్ర బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే...

**కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరినీ ఆనందాన్ని పంచలేకపోయింది. కొన్ని వర్గాలకు కాస్త ఊరట లభించగా మరికొన్ని వర్గాలను నిరుత్సాహ పరిచింది. బడ్జెట్‌పై ఉన్నో ఆశలు పెట్టుకుంటే ఉసూరుమనిపించిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా విభజన హామీలు, ప్రత్యేక హోదా ప్రస్తావన లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల కొనుగోలు శక్తి, వస్తు ఉత్పత్తి గిరాకీని పెంచేందుకు, ద్రవ్యోల్బణాన్ని నిలువరించి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను కట్టడి చేసేందుకు సమగ్ర దష్టి సారించని ఈ కేంద్ర బడ్జెట్ కేవలం ప్రభుత్వ పద్దులను పార్లమెంటుకు సమర్పించే ప్రక్రియ తప్ప ప్రభుత్వ ప్రకటిత 'వికసిత భారత్'లో భాగం కాజాలదని పేర్కొంటున్నారు.**

### ఎపికి పెద్దపీట
### వల్లభనేని బాలశౌరి, బందరు ఎంపి


**కలెక్టరేట్(కృష్ణా):** కేంద్ర బడ్జెట్‌లో ఎపికి పెద్దపీట వేయడం సంతోషంగా ఉంది. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు ఇస్తామని చెప్పడం, అమరావతి నిర్మాణం కోసం బహుళ సంస్థల ద్వారా నిధులు ఏర్పాటు చేస్తామని చెప్పడం శుభ పరిణామం.

### కృష్ణాజిల్లా ప్రజలకు నిరాశే
### సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

**కలెక్టరేట్ (కృష్ణా):** కేంద్ర బడ్జెట్‌లో కృష్ణాజిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసింది. రాష్ట్రానికి, జిల్లాకి తలమానికంగా నిలిచే పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా బాధ్యత తీసుకుంటామని చెప్పడం ఈ ప్రాంత ప్రజలను మరో సారి మోసం చేయడమే. దీనివల్ల కృష్ణా డెల్టా రైతాంగం మరోసారి నష్టపోవాల్సి వస్తుంది. బాధ్యత తీసుకుంటామని చెప్పి తప్పుకోకుండా నిర్దిష్టంగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేలా నిధులను బడ్జెట్‌లో కేటాయించి విడుదల చేయాలి. బందర్ పోర్టు నిర్మాణానికి సంబంధించి ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరం. పోర్టు నిర్మాణం ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుండి ఇవ్వాల్సిన నిధులు ప్రస్తావన లేకపోవడం మోసపూరితం.

### ప్రజల పొదుపుపై ప్రతికూల ప్రభావం
### ఐసిఇయు డివిజన్ కార్యదర్శి జి.కిషోర్ కుమార్

**కలెక్టరేట్ (కృష్ణా):** కేంద్ర బడ్జెట్ వాస్తవ ప్రజల జీవనానికి ఏమాత్రం ఉపశమనం కలిగించేదిగా లేదు. ఊహా జనితమైన వృద్ధిరేటు అంచనాలతోనూ, పొంతనలేని గణాంకాలతోనూ కూర్పు చేయబడింది. ఈ బడ్జెట్లో భీమారంగ వృద్ధికి ఏ విధమైన పన్ను రాయితీ, ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా పాలసీదారులకు భారంగా పరిణమించిన ఇన్సూరెన్స్ ప్రీమియంపై జిఎస్‌టిని జీవిత బీమా, ఆరోగ్య బీమాలపై తగ్గించే ప్రతిపాదన చేయకపోవడం వల్ల ప్రజల పొదుపుపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఆదాయపు పన్ను స్లాబులలో స్వల్పంగా మార్పులు చేసినప్పటికీ, ఇప్పటికే 30 శాతం మేర ఆదాయపు పన్ను చెల్లిస్తున్న ఉద్యోగ వర్గానికి ఉపశమనం కలిగించలేదు. నూతన పన్ను విధానంలో పొదుపుపై రాయితీని ఏమాత్రం పెంచకపోవడం ఉద్యోగ వర్గాన్ని నిరుత్సాహపరచడంతో పాటు, ప్రజలలో పొదుపుతత్వాన్ని నిర్వీర్యం చేసేదిగా ఉంది.



### ఎపికి నిధులు కేటాయింపు హర్షణీయం
### మండలి బుద్ధప్రసాద్, అవనిగడ్డ ఎంఎల్ఎ

**అవనిగడ్డ:** కేంద్ర బడ్జెట్లో ఎపి గురించి ప్రత్యేకించి ప్రస్తావించి నిధులు కేటాయించడం హర్షణీయం. విశాఖపట్నం చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణానికి సహాయం గ్రామీణ అభివృద్ధి పథకాలకు రూ 2.66 లక్షల కోట్లు, ఆక్వా సాగుకు ప్రోత్సాహం పూర్వోదయ పథకం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక ప్రాజెక్టులు మంజూరు చేయడం రాష్ట్ర అభివద్ధికి దోహదం చేస్తాయి.

### కేంద్ర బడ్జెట్ హర్షణీయం
### జనసేన మచిలీపట్నం ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ

**మచిలీపట్నం రూరల్:** కేంద్ర బడ్జెట్లో ఎపి అగ్రపీట వేసి అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడం పట్ల ఆంధ్ర ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పోలవరం ప్రాజెక్టు పూర్తి బాధ్యత కేంద్రం తీసుకొని నిధులు మంజూరు చేస్తామని చెప్పడం స్వాగతించదగిన విషయం.

### పన్ను తగ్గింపుతో స్వర్ణకారులకు ఊరట
### రాష్ట్ర స్వర్ణకార సంఘం కార్యదర్శి గడ్డం రాజు

బంగారం, వెండి వ్యాపారులకు ఈ బడ్జెట్లో ఊరట లభించింది. బంగారం, వెండిపై ఆరు శాతం కస్టమ్స్ పన్ను తగ్గించడంతో వ్యాపారం పెరిగే అవకాశముంది. ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం మరింత సహకారం అందించాలి.

### వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలి
### ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.నాగేశ్వరరావు

**బంటుమిల్లి:** కేంద్ర బడ్జెట్లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు. వ్యవసాయ నిపుణులు, మేధావుల సూచనల ప్రకారం నిధులుపెంచాల్సి ఉంది. మార్కెట్ ధరల హెచ్చుతగ్గులతో ఇబ్బందులకు గురయ్యే రైతాంగాన్ని ఆదుకునేందుకు ధరల స్థిరీకరణ నిధి, రుణమాఫీకి నిధులు కేటాయించకపోవడం బాధాకరం.

### ప్రత్యేక హోదా ఊసేలేదు
### వెలిసెల సుబ్రమణ్యం, కాంగ్రెస్ పార్టీ జిల్లా మీడియా కోఆర్డినేటర్

**కంకిపాడు:** కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంపై ఉన్న బాధ్యతారాహిత్యం మరోసారి బడ్జెట్ కేటాయింపుల్లో బట్టబయలైంది. పారిశ్రామిక రాయితీలు ఇస్తామన్నారు కానీ ప్రత్యేక హోదా ఊసు ఎక్కడ లేకపోవడం బాధాకరం.

### ఎపికి నిధులు కేటాయింపు ముదావహం
### బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీరాజబాబు

**గుడివాడ:** కేంద్ర బడ్జెట్‌లో ఎంపికి అగ్రపీట వేయడం అభినందనీయం. అమరావతికి నిధులు కేటాయించడం పట్ల ప్రజలందరూ హర్షం వ్యక్తం చేసున్నారు. ఈ బడ్జెట్ గత పది సంవత్సరాల బడ్జెట్ కంటే భిన్నంగా ఉంది. బంగారం, వెండిపై ఆరు శాతం కస్టమ్స్ పన్ను తగ్గించడం మధ్యతరగతి కుటుంబాలకు ఊరట. ఏపీ విభజన చట్టంలో పేర్కొన్న మేరకు వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ప్రకటించడం గొప్ప విషయం.

## ఎల్‌బిఆర్ సిఇ అధ్యాపకునికి పిహెచ్‌డి



ధనుంజయ్‌కు పిహెచ్‌డి అందజేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - మైలవరం :** స్థానిక లక్కిరెడ్డి బాల్రెడ్డి ఇంజినీరింగ్ కళా శాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న అధ్యాపకులు ధనుంజయ్ కుమార్‌కు పిహెచ్‌డిని ప్రదానం చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిట్, ట్రిచి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఎక్స్‌పరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ మెకానికల్, ట్రిబోలాజికల్ అండ్ ఎలక్ట్రికల్ డిస్‌ఛార్జి మచినింగ్, చారెక్టరిస్టి అఫ్ ఎ జడ్ 91 కాంపోసిట్స్ విత్ మ్యాచింగ్ లెర్నింగ్ టెక్నిక్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పిహెచ్‌డిని ప్రధానం చేశారన్నారు. ఈ పరిశోధన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఎస్ఎస్.హరీష్ పర్యవేక్షణలో జరిగిందన్నారు. ఈ పరిశోధన అల్యూమినియం కన్నా తక్కువ బరువు ఉండే ఎ జడ్ 91 ని వివిధ ఇండస్ట్రీల్లో ఉపయోగించేలా ప్రాపర్టీస్‌ని ఎలా పెంచాలో పరిశోధన ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, యాజమాన్యం ధనుంజయ్ కుమార్‌ని అభినందించారు.



కరపత్రాలను చూపుతున్న రైతులు

## కౌలు రైతుల సమస్యలపై ధర్నా

**ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు :** కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం నాయకులు దారా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కౌలు రైతులు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పాత సినిమా హాల్ సెంటర్‌లో కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూయజమానికి సంబంధం లేకుండా కౌలు రైతులకు కౌలు కార్డులు మంజూరు చేయాలని, బ్యాంకులు ద్వారా రుణాలు ఇవ్వాలని, సబ్సిడీపై ఎరువులు విత్తనాలు అందించాలని, పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఎ దృష్టికి పలు సమస్యలు

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకట కష్ణ ప్రసాద్ ని గొల్లపూడి పార్టీ కార్యాలయంలో రెడ్డిగూడెం దళితవాడ నాయకులు కలిసి సమస్యలు విన్నవించారు. దళితవాడలో పడమటిగూడెంలో ఉన్న కూలిపోయిన వంతెనను పునర్నిర్మించాలని కోరారు. సిసి రోడ్లు, డ్రైన్లు, ఎప్పటినుంచో కలగా మిగిలిపోయిన కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని కోరారు. ఎంఎల్‌ఎ వసంత స్పందించి వంతెనను వేయిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలోనే నేను కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.కోటి నిధులు తీసుకొచ్చానని బిల్లులు వస్తాయో రావోనని కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని అన్నారు. కమ్యూనిటీ హాల్‌ను కట్టించేందుకు సానుకూలంగా స్పందించారన్నారు. ఎంఎల్‌ఎను కలిసిన వారిలో రెడ్డిగూడెం వసంత యువసేన నాయకులు మాతంగి రామారావు చాట్ల అచ్చాలు, పల్లిపాం భీమయ్య, టిఎన్‌టియుసి మండల అధ్యక్షులు చాట్ల బాబూరావు పులిపాక అనంత కుమార్ పాల్గొన్నారు.

## నూతన డిగ్రీ కోర్సులు ప్రారంభం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణంలోని వాగ్దేవి మహిళా డిగ్రీ కళాశాలలో నూతన అడ్వాన్స్‌డ్ డిగ్రీ కోర్సులను ప్రారంభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేష్ వివరించారు. అన్ని రకాల రంగాల్లో ప్రాముఖ్యత సంతరించుకున్న బిఎస్‌సి ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ కోర్సును, కార్పొరేట్ రంగాల్లో అత్యధిక ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలిగిన బిఎస్సి ఫుడ్ టెక్నాలజీ, బిఎస్‌సి నర్సింగ్, బిఎస్‌సి మైక్రో బయాలజీ కోర్సులను నూతనంగా ప్రారంభించినట్టు వివరించారు. మహిళా విద్యార్థులకు ప్రత్యేకంగా విజయవాడ, గుంటూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పని లేకుండా జగ్గయ్యపేటలోనే ప్రభుత్వం అందించే ఫీజు రియంబర్స్‌మెంట్‌తో వందశాతం ఉద్యోగ అవకాశాలు గల నూతన డిగ్రీ కోర్సులను అందిస్తున్నట్లు కళాశాల కరెస్పాండెంట్ బి.సరిత వివరించారు.

## పొలాల సందర్శన



**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** మండలంలోని గరికపాడు డాక్టర్ కె.ఎల్.రావు కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా వత్సవాయి మండలంలోని మక్కపేట, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామాల్లో ఆయా పొలాలను మంగళవారం సందర్శించారు. అధిక వర్షాల వల్ల ప్రతి పంటలో బరువు నేలల్లో మరియు పల్లపు ప్రాంతంలో అధిక తేమ వలన ఎర్రబడినట్లు గుర్తించారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు వర్షం తగ్గిన వెంటనే ఎకరానికి 25 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను అందించాలని సూచించారు. ఆ తర్వాత సూక్ష్మ పోషక లోప నివారణ కొరకు ఫార్ములా 4, పొటాషియం నైట్రేట్ వంటి సూక్ష్మ పోషకాలు కలిగిన ఎరువులను పై పాటుగా పిచికారి చేయాలన్నారు. మిరప నారు మడులలో నుండి తెగులు గమనించినట్లయితే లీటర్ నీటికి రెండున్నర గ్రాముల బ్లైటాక్స్ కలిపి పిచికారి చేయాలని చెప్పారు. వరి నారుమడులలో వర్షం తగ్గిన వెంటనే ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా ఒక కిలో పొటాష్ వంతున వేసుకోవాలని సూచించారు. ఈ క్షేత్ర సందర్శనలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కృష్ణంరాజు, డాక్టర్ పి.ఎన్. శివప్రసాద్, డాక్టర్ ఎన్.రాజశేఖర్, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ బి. వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సి.భవాని, పెనుగంచిప్రోలు వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ అధికారులు చింతాల దివ్య, మక్కపేట, పెనుగంచిప్రోలు, షేర్ మహమ్మద్ పేట రైతులు పాల్గొన్నారు.

## 'అల్ట్రాటెక్' బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాల వారిని పరామర్శిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** మండలంలోని బూదవాడ గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, జిల్లా సహాయక కార్యదర్శి పానెం ఆనందరావు, మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోటా కృష్ణ, భాస్కరరావు, బాలు, ఎం.కృష్ణ బృందం గ్రామంలో పర్యటించింది. ఈ సందర్భంగా ఇటీవల అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రమాదంలో చనిపోయిన నలుగురు కార్మిక కుటుంబాలు బాణావత్ స్వామి, ఆవుల వెంకటేష్, పరిటాల అర్జున్ రావు, బాణావత్ గోపి కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ అల్ట్రాటెక్ ప్రమాదంలో గాయపడ్డ మరో ఇద్దరు కార్మికులు ఇంకా కోలుకోని స్థితిలో ఉన్నారన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని వారి కుటుంబాలకు కనీసం 5 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఇవ్వాలని, జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని కోరారు.

## ఆధార్ క్యాంపుల పరిశీలన

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణ పరిధిలో గల కాకానినగర్, రంగస్వామి బజారు వార్డు సచివాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులను మంగళవారం మునిసిపల్ కమిషనర్ మల్లేశ్వర రావు పరిశీలించారు. సదరు ఆధార్ క్యాంపులలో ఆధార్ కార్డులు కొత్తగా నమోదు, అడ్రస్ మార్పులుకోసం, తప్పులను సరిచేయించేయడం చేస్తున్నారు. సుమారు 50 మంది ఆధార్ సర్వీసులను సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. సదరు క్యాంపులు పట్టణంలో 27 వరకు ఆధార్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 24న సీతారాంపురం (పాత మునిసిపల్ కార్యాలయంలో), పాతగడ్డ స్ట్రీట్, మీసేవ బిల్డింగ్ వార్డు సచివాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వార్డు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం అన్న కాంటీన్ పనులు పరిశీలించారు. అన్న క్యాంటీన్‌ను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్, కాంట్రాక్టరుకు ప్రభుత్వం వారు సూచించిన నాణ్యతా ప్రమాణాలు లోబడి ప్రభుత్వం వారు నిర్దేశించిన డిజైన్ ప్రకారం వచ్చే నెల 10వ తేదీలోపు పనిని పూర్తి చేయాలని ఆదేశించారు.

## ఎపి ట్రాన్స్‌కో నూతన జెఎమ్‌డికి శుభాకాంక్షలు



జెఎమ్‌డిని కలిసిన నాయకులు

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** ఏపీఎస్ఇబి ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏ వీ కిరణ్ ఆధ్వర్యంలో నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్మిషన్ కార్పొరేషన్ జెఎమ్‌డి కీర్తి చేకూరిలను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏ.వి. కిరణ్ నాయకత్వంలోని అసోసియేషన్ నాయకులు కీర్తిని సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కిరణ్ మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగులందరూ ఎప్పటిలాగానే కష్టపడి పని చేస్తూ యాజమాన్యానికి ఎల్లప్పుడు సహకరిస్తూ సంస్థ అభివద్ధికి పాటు పడతామని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ ట్రెజరర్ ఎం.సోమశేఖర్, స్టేట్ అడిషనల్ జనరల్ సెక్రటరీ వి.డి.సర్వేశ్వరరావు, జెన్కో ప్రెసిడెంట్ వై.కళ్యాణ్ కుమార్, ట్రాన్స్‌కో అధ్యక్షులు జి.జయకర్ రాయ్, సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంను కలిసిన సీనియర్ న్యాయవాది తుర్లపాటి

**ప్రజాశక్తి - నందిగామ :** దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డిని మంగళవారం నందిగామకు చెందిన సీనియర్ అడ్వకేట్, చిన్ననాటి స్నేహితుడు తుర్లపాటి ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. తమ కాలేజ్ డేస్‌ను మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, సీనియర్ అడ్వకేట్ తుర్లపాటి ప్రసాద్ గుర్తు చేసుకున్నారు. మంత్రి చేతులు మీదుగా దేవాదాయశాఖ కమిషనర్‌కు కనకదుర్గమ్మ నిత్య అన్నదాన ట్రస్ట్‌కు, అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయానికి ద్వారకా తిరుమల ఆలయాలకు రూ.50వేలు చొప్పున, పెనుగంచిప్రోలు ఆలయానికి, వేదాద్రి ఆలయానికి తిరుమలగిరి ఆలయానికి రూ.25వేలు చొప్పున అందజేశారు. ఆయన వెంట చందర్లపాడు మాజీ ఎంపిపి సీనియర్ అడ్వకేట్ బొందలపాటి రామకృష్ణ, జుజ్జూరు వైస్ ప్రెసిడెంట్ సాయి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

**ప్రజాశక్తి - గంపలగూడెం :** మండలంలో పలు ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులు - తల్లిదండ్రులు కోరుచున్నారు. అందులో భాగంగా ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్, పిడి, నాచురల్ సైన్స్ పోస్టులు గత ఏడాది కాలంగా ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులకు ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల కు సంబంధించి, సబ్జెక్టుల బోధన సరిగా లేదని తెలుపుతున్నారు. సబ్జెక్టును పూర్తి చేసేందుకు ఎవరో ఒకరు ఆ సమయాన్ని తాతకాలికంగా గడుపుతున్నారు తప్పా, సరైన రీతిలో బోధన అందడం లేదని వివరించారు. అదనంగా సమయాన్ని ఉపయోగించి, ఉపాధ్యాయులకు పని ఒత్తిడి పెరుగుతుందని మరోవైపు తెలుస్తోంది. ఆ పాఠశాలలో సంవత్సరకాలంగా ఫిజికల్ డైరెక్టర్ లేకపోవడంతో విద్యార్థుల వ్యాయామానికి గండిపడింది. పై అంశాలను విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిగణలోకి తీసుకొని వెంటనే ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కోరుచున్నారు.ఇదిలా ఉంటే ఊటుకూరు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పోస్ట్ సైతం ఖాళీగా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ పోస్ట్ ను కూడా భర్తీ చేసినట్లయితే ప్రస్తుతం ఎఫ్‌ఎసి హెచ్‌ఎం గా కొనసాగుతున్న మంజుల తమ సబ్జెక్టులను క్షుణ్ణంగా విద్యార్థులకు బోధించే అవకాశాలు ఉన్నాయి.

## ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - మైలవరం :** అనారోగ్యంతో మృతిచెందిన మైలవరం, వెల్వడంకు చెందిన టిడిపి కార్యకర్తలు కుటుంబాలకు ఆ పార్టీ నాయకులు రూ.5 వేలు ఆర్థికిసాయం అందజేశారు. మైలవరానికి చెందిన బెల్లంకొండ నరసింహారావు, వెల్వడం భాస్కర్ నగర్ కాలనీకి చెందిన బెల్లంకొండ జమలయ్యల కుటుంబాలకు స్థానిక టిడిపి నాయకులు లంక నితీష్, మల్లెల రాధాకృష్ణ, వార్డ్ మెంబర్ దుర్గారావు, దుర్ బాలకృష్ణ, పత్తిపాటి ప్రభాకర్, అంకరాజు ఆర్థిక సాయం అందజేసిన వారిలో ఉన్నారు.

## తిలక్, ఆజాద్ జయంతి

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు మండలంలోని లక్ష్మీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయోద్యమ నాయకులు లోకమాన్య బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతి మంగళవారం నిర్వహిం చారు. స్వరాజ్యం నా జన్మహక్కు అని నినాదం ఇచ్చిన నాయకులు, మరాఠా, కేసరి వంటి పత్రికలు నడిపి ప్రజలలో జాతీయో ద్యమ స్ఫూర్తిని నిలిపిన నాయకులు తిలక్ అయితే 15 సంవత్సరాల వయస్సులోనే జాతీయోద్యమంలో పాల్గొని జైలు శిక్షను అనుభవించి మరణించేంత వరకు పోరాట స్ఫూర్తితో బతికిన ధీశాలి చంద్రశేఖర్ ఆజాద్ అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.హరి కృష్ణ తెలిపారు. ఈ సం దర్భంగా ఇరువురు చిత్ర పటాలకు పూలమాలేసి నివా ళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు సుజాతకుమారి, పద్మలత, లక్ష్మీశ్యామల, విద్యార్థులు పాల్గొన్నారు.




కాల్వ పూడిక తీస్తున్న దృశ్యం

## పారిశుధ్య పనులు ప్రారంభం

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** మండల కేంద్రంలో వడ్డెర కాలనీలో డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి డాక్టర్ వి.రవికుమార్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆశీర్వాదం, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రుడికి పరామర్శ


**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ఇటీవల బైక్‌పై నుండి కాలికి గాయమైన మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొండను ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మంగళవారం పరామర్శించారు. పట్టణంలోని 14వ వార్డు విలియంపేటకు కొండను ఆయన గృహంలో ఎంఎల్‌ఎ కలిశారు.

## రహదారికి మరమ్మతులు

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు ప్రభుత్వాసుపత్రి సమీపంలో కోకిలంపాడు రోడ్డుపై ఏర్పడిన గోతులతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఎంఎల్‌ఎ కె.శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు ఆర్‌అండ్‌బి అధికారులు మంగళవారం మరమ్మతు పనులు చేపట్టారు. రహదారికి ఇరువైపులా మురుగునీరు వర్షపు నీరు పారుదలకు వీలుగా తాత్కాలిక డ్రైనేజీ తవ్వించి రోడ్డుపై గుంతలను గ్రావెల్ మట్టితో పూడ్చి వేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని 60 అడుగుల మేర వెడల్పు చేయాలని ఆర్ అండ్ బి అధికారులు గతంలో నిర్ణయించినప్పటికీ నిధులు మంజూరుకాక పనులు ప్రారంభించలేదు. ఈ నెల 20న రహదారిపై ఉన్న గోతులతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులు చూసి ఎంఎల్‌ఎ అక్కడే స్టూల్‌పై కూర్చుని నిరసన తెలిపారు.

# బాబోయ్ దోమలు...

## గన్నవరంలో పారిశుధ్యం అధ్వానం







అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

**ప్రజాశక్తి-గన్నవరం:** దోమలు బాబోయ్.. దోమలు.. అవి కుడితే జ్వరాలు, డెంగీ వస్తే పోతున్న ప్రాణాలు. మందులు కొడుతున్నా చావని దోమలు.. అవి కుడితే చనిపోతున్న జనాలు. ఇదీ గన్నవరం మండలంలో ప్రజల నుంచి వినిపిస్తున్న వేదన. కాలంతో పని లేదు. దోమలు విపరీతంగా పుట్టుకొస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా దాడులు చేసిజనాలను ఆసుపత్రుల పాల్జేస్తున్నాయి. దోమలపై దండయాత్రలు చేస్తే అవి చావలేదు కదా పెరిగిపోయి జనాలపై దాడులు పెంచాయి. దీంతో ఏ ఇంట్లో చూసినా జ్వరాలతో ఇబ్బదులు పడుతున్నారు. పల్లెల్లో దోమలు విజృంభించడంతో జనాలు రోగాలతో అల్లాడుతు న్నారు. పారి శుధ్యం అస్తవ్యస్తంగా ఉండటమే కారణం. చెత్తకాల్వల్లో వేయడం వల్ల మురుగు నిలిచిపోయి దోమలకు విలయంగా మారుతోంది. దీంతో దోమలు పెరిగి జనాలపై దాడులు చేస్తున్నాయి. పంచాయతీ అధికా రులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. గన్నవరం పట్టణంలో కనీసం పాగింగ్ చేయడం లేదంటున్నారు. పట్టణంలోని చెంచులకాలనీ, గౌడపేట, ముస్లింపేట, దళితవాడ తో పాటు శ్రీనగర్ కా లనీలో మురుగు నిలిచిపోతుంది. దోమలకు నిలయంగా మారాయని నివాశితులు తెలిపారు. విష్వరాలు అధికంగా రావడంతో ఆసుపత్రుల్లో రోగులు పెరుగుతు న్నారు. మలేరియా, డెంగ్యూ వస్తుందని జనాలు భయపడుతున్నారు. కేసరపల్లిలో డ్రైయిన్లలో పూడికలు తీయడం లేదు. అజ్జంపూడి, బిబిగూడెం . చిన ఆవుటపల్లి, ముస్తాబాద్, సూరంపల్లి పంచాయతీల్లో డ్రైయిన్లు పారడం లేదు. మురుగుతో దోమలు ఉత్పత్తి పెరిగి విజంభిస్తున్నాయని జనాలు తెలిపారు. ఇప్పటికే జ్వరాలతో బాధలు పడుతున్నామని చెప్పారు. ముస్తాబాద్, గన్నవరం ఆసుపత్రుల్లోజ్వరాల రోగల సంఖ్య పెరుగుతోంది. ముస్తాబాద, గన్నవరం ఆసుపత్రుల్లో జ్వరాల రోగల సంఖ్య పెరుగుతోంది. డెంగ్యూ లాంటిది వస్తే చికిత్సలు చేయడం సాధ్యం కాదని చెబుతున్నారు. విజయవాడ లాంటి ఆసుపత్రికి రోగులను తరలించాల్సి వస్తుందని తెలిపారు. పంచాయతీలో చెత్త, మురుగు శుభ్రం చేసే పరిస్థితి కనిపించడం లేదు. నిధుల్లేక పోవడమే కారణమని అంటున్నారు. మండలంలోని 21 పంచాయ తీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవడానికి అధికారులు ముందుకు రావడం లేదు. మురుగు గోతుల్లో బ్లీచింగ్, కిరోసిన్ చల్లిస్తే దోమలు ఉత్పత్తి ఉండదని అం టున్నారు. గన్నవరంలో వార్డులో రెండు రోజుల కోసారి కూడా చెత్తను తీసుకెళ్లడం లేదని తెలిపారు. ఎ క్కడ చెత్త అక్కడే ఉంటుందని, ఈపరిస్థితుల్లో జనాలు పడుతున్న అవస్థలు వర్ణాతీతంగా ఉన్నాయి. ఇవ ఏటికైనా మండల స్థాయి అధికారులు రంగంలోకి దిగి పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాలని, దోమల నియంత్రణకు యుద్ధం ప్రకటించాలని కోరుతున్నారు.



## సహకార సంఘాల ద్వారా ఎరువులు విక్రయం

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశాల ప్రకారం సహకార సంఘాలు ఎరువుల అమ్మకంలో కీలక పాత్ర పోషించాలని ఇంచార్జి ఎడిఎ ఎన్.రమాదేవి తెలిపారు. మంగళవారం గూడూరు మండలంలోని అన్ని సహకార సంఘ కార్యదర్శులతో గూడూరు సహకార సంఘ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొసైటీలలో అన్ని రకాల ఎరువులను ఉంచాలని తప్పనిసరిగా స్టాక్ బోర్డులో ఎరువుల వివరాలు వాటి ధరలు ఎంత స్టాక్ ఉన్నది తెలిసేలా ఉంచాలన్నారు. తప్పనిసరిగా వాలిడిటీ ఉన్న లైసెన్స్‌ను, రైతులు సంతకంతో బిల్లు, ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్ అప్డేట్ చేసి ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జివి శివప్రసాద్, విఎఎలు ప్రభాకర్, ఈశ్వర్, ప్రవీణ్, పవన్ సొసైటీ సిఇఒలు చక్రవర్తి, గణేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## అందరూ ఐక్యంగా ఉండాలి : విక్టర్‌ప్రసాద్

**కృత్తివెన్ను:** కులాలు వేరైనా అందరూ ఐక్యంగా ఉండాలని, మానవతా దక్పథంతో సామరస్యంగా మెలగాలని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ ప్రజలను కోరారు. కృత్తివెన్ను మండలం చిన్న గొల్లపాలెం బీచ్ వద్ద కొన్ని కులాల మధ్య తలెత్తిన భూ సమస్యలను మంగళవారం ఆయన విచారించారు. భూ సమస్య ప్రాంతాన్ని పరిశీలించి ఆయా కుల సంఘ పెద్దలు, గ్రామస్తులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 50 ఏళ్ల కిందట గ్రామానికి తీర ప్రాంతంలో ఉన్న అన్ సర్వే ల్యాండ్ ను ఎస్సీ వర్గానికి చెందినవారు పంచుకున్నారని, అయితే ఆ భూమిని ఎస్సీ యేతరులు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని వచ్చిన ఫిర్యాదుపై ఇక్కడకు రావడం జరిగిందని, ఈ సమస్యపై ఇరు వర్గాలతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడం జరిగిందన్నారు. సమస్య పరిష్కారానికి రెవెన్యూ అధికారులతో చర్చించి అందరికీ న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో బందరు ఆర్డిఓ ఎం వాణి, డిఎస్‌పి అబ్దుల్ సుభాని, తహసిల్దార్ రామకోటేశ్వరరావు, సర్పంచ్ పెనుమాల సునీల్ పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న విక్టర్‌ప్రసాద్

## త్రివేణి విద్యార్థులకు బంగారు పతకాలు

**ప్రజాశక్తి-గుడివాడ :** ఇటీవల మైసూర్‌లో జరిగిన భగవద్గీత జాతీయస్థాయి పోటీలలో త్రివేణి విద్యార్థి కె.వెంకటనాగ అక్షయకు బంగారు పతకం, యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కైకాల కళామందిరంలో జరిగిన యోగా ప్రాముఖ్యత - ప్రయోజనాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో తమ విద్యార్థి ఎం.దివ్యశ్రీ ప్రథమ బహుమతి, పి.మోక్షితకు ద్వితీయ బహుమతులు సాధించడం గొప్ప విషయమని పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.శివశంకర్ తెలిపారు. మంగళవారం స్థానిక పాటిమిద గల త్రివేణి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో వివిధ పోటీలలో బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శివశంకర్ మాట్లాడుతూ జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలో జరిగిన వివిధ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు బంగారు పతకం సాధించి ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు సాధించడం గుడివాడకే గర్వకారణమన్నారు.








## విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచాలి

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్:** విద్యార్థులలో పఠనా శక్తిని పెంచడానికి తల్లి దండ్రులు కృషి చేయాలనీ పిఎమ్ శ్రీ కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపాల్ అసీఫ్ హుస్సేన్ పేర్కొన్నారు.స్థానిక పిఎమ్ శ్రీ కేంద్రీయ విద్యాలయ లో నూతన విద్యా విధానం 2020 వార్షికోత్సవంను పురస్కరించుకొని శిక్షా సప్తాహ్ లో భాగంగా మంగళవారం ప్రాథమిక అక్షరాస్యత, గణిత నైపుణ్యాలు పెంపొందించుట అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులలో కనీసం చదవడం, రాయడం లాంటి నైపుణ్యాలు కొరవడుతున్నాయని,వాటిని పెంపొందించుట ఎఫ్ ఎల్ ఎన్ లక్ష్యం అన్నారు. ఉత్తమ బోధన వలన, నిత్యం పుస్తకం పఠనం, రాయడం వలన విద్యలో వెనుక బడిన వారిని ముందుకు తీసుకుని రావాలాన్నారు. అలాగే విద్యా లయ హెచ్ ఎం జె. గ్లోరీ స్వరూప రాణి పి పి టి ద్వారా ఎఫ్ ఎల్ ఎన్ గురించి వివరించారు. విద్యార్థుల నాటికలు ప్రదర్శించి , కథలు చెప్పి అలరించారు. కార్యక్రమం లో పీజీటీ ఆర్. విజయ్ కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కృష్ణకిషోర్‌కు ఐకాసలో ప్రసంగించే అవకాశం



**ప్రజాశక్తి-మోపిదేవి:** మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి పంచాయతీలో ఉన్న అడపావారిపాలెం గ్రామానికి చెందిన పండలనేని శివప్రసాద్ కుమారుడు పండలనేని కృష్ణకిషోర్ అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని కొలంబియా యూనివర్సరీలో స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్‌లో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విద్యనభ్యశిస్తున్నారు. ఈ క్రమంలో ఐక్యరాజ్యసమితిలో ఉన్నత స్థాయి రాజకీయ సమూహంలో 'సుస్థిర అభివృద్ధి' అనే అంశంపై ప్రసంగించే అవకాశం పొందారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చి తన ప్రతిభతో ఐక్యరాజ్యసమితి నుంచి ఆహ్వానం పొందే స్థాయికి చేరుకోవడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థులకు కిట్లు పంపిణీ



**ప్రజాశక్తి-తోట్లవల్లూరు:** విద్యార్థులు బాగా చదువుకుని అభివృద్ధిలోకి రావాలని, తల్లిదండ్రులకు ఉన్న ఊరికి దేశానికి మంచి పేరు తీసుకురావాలని బిఎస్పీ పార్టీ నాయకురాలు, ది గుడ్విన్ చార్ట్ అవర్ ట్రస్ట్ చైర్మన్ దేవరపల్లి దేవమణి అన్నారు. మంగళవారం దేవరపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూలు బ్యాగ్స్, నోట్ బుక్స్, విద్యార్థులకు అవసరమైన పాఠశాల కిట్స్ ను అందించారు. పాఠశాల పూర్వ విద్యార్థి దేవరపల్లి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కిట్స్ అందజేసినట్లు తెలిపారు. జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి, జొన్నల రవీందర్ రెడ్డి, భీమవరపు నాగేశ్వర్ రెడ్డి, మరీదు నాంచారయ్య, దేవరపల్లి షర్లి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట శివరామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కొడాలి మాజీ పిఎ లక్ష్మోజీపై దాడి

**ప్రజాశక్తి-గుడివాడ :** కొడాలి నాని మాజీ పిఎ ఆచంట లక్ష్మోజీపై గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. ప్రస్తుతం లక్ష్మోజీ మచిలీపట్నం కలెక్టరేట్లో పౌరసరఫరాల విభాగం సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. మచిలీపట్నం నుంచి విధులు ముగించుకుని సోమవారం రాత్రి రైలులో గుడివాడ వచ్చి స్టేషన్ పక్కనే సిఎస్ఐ చర్చి ఆవరణలో ఉన్న తన ద్విచక్ర వాహనాన్ని తీస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసినట్లు తెలుస్తోంది. తనపై దాడి చేసింది ఎవరో తనకు తెలియదని, ఎలాంటి కేసులు వద్దని లక్ష్మోజీ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి ఏలూరు రోడ్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు.

## మహిళలకు రక్షణ కల్పించాలని ర్యాలీ

**ప్రజాశక్తి-గుడివాడ :** చిన్నారులు, మహిళలకు రక్షణ కల్పించే చట్టాలను అమలు చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక ఏలూరురోడ్డులోని వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్ వద్ద నుండి నెహ్రూచౌక్ వరకు విద్యార్థినిలకు, చిన్నారులకు, మహిళాలకు రక్షణ కల్పించాలని కోరుతూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, జిల్లా కన్వీనర్ సాద్విక్ పాల్గొన్నారు.

## వాణిజ్య పంటల పరిశీలన

**ప్రజాశక్తి-పమిడిముక్కల:** మిరప, పసుపు, కంద, చెరకు, అరటి పంటలను రైతులు అధిక వర్షాల బారి నుండి కాపాడుకోవాలని కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు మంజువాణి పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో వాణిజ్య పంటలను రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. పొలాల్లో నీరు నిల్ల లేకుండా చేసుకోవాలని సూచించారు. సహజ ఎరువులు వాడాలన్నారు.

## మంత్రి నిమ్మలకు స్వాగతం




**ప్రజాశక్తి-గన్నవరం:** పోలవరం ప్రాజెక్టు త్వరగా పూర్తి అవ్వటానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నిధులకు హామీ పొంది మంగళవారం ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చేరుకున్నారు. ఈ సందర్భంగా సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, రాష్ట్ర టిడిపి నీరు చెట్టు కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు కవులూరు రాజా చంద్రమౌళి, చెన్నుపాటి శ్రీధర్ మంత్రికి ఘనస్వాగతం పలికారు.

## హిందీ టాలెంట్ టెస్ట్‌లో నాగార్జున విద్యార్థులకు పతకాలు

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు నాగార్జున పాఠశాలలో నిర్వహించిన 2023-24 గోదావరి హిందీ టాలెంట్ టెస్ట్ ఫలితాలలో తమ విద్యార్థులు మంచి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ కె.నరసింహారావు సోమవారం విలేకర్లకు తెలిపారు. బి.గ్రీష్మజ, కె.సాయిదివ్యశ్రీ రాష్ట్ర స్థాయిలో 2వ స్థానం, క్యాష్ ప్రైజ్, మెమెంట్, గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ కైవసం చేసుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్‌తో పాటు కరెస్పాండెంట్ వేమూరి నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.సురేష్, నాగార్జున జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శేషగిరి, డి.హనుమంతురావు, టి.సూరిబాబు పాఠశాల అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

## విద్యారంగ సమస్యలపై వినతి


వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** రాష్ట్రంలో గత ప్రభుత్వం అమలు చేసిన విద్యారంగ సంస్కరణ ఫలితంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని విద్యారంగాన్ని కాపాడాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి.మనోహర్ కుమార్ మాట్లాడుతూ వివిధ మేనేజ్‌మెంట్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. పెరిగిన పనిభారం, సమస్యలు పరిష్కారం కాక ఉపాధ్యాయుల్లో అసంతృప్తి ఉందని తెలిపారు. డిఇఒ యు.వి.సుబ్బారావు యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం కలెక్టర్ సృజనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య ఉన్నారు. జిల్లాలో ఎన్నికల డ్యూటీ చేసిన వారికి సర్టిఫికెట్, విద్యారంగ సమస్యల గురించి వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పి.నాగేశ్వరరావు, అనంత్ కుమార్, ఎం.లలిత, బి.రమేష్ సుబ్బారెడ్డి, దేవ్, జి. వి.రావు, జానకి, యోగేశ్వ రి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## టిండాల్ కం డ్రైవర్ కోర్సుకు దరఖాస్తులు

**ప్రజాశక్తి - విజయవాడ :** 'టిండాల్ కం డ్రైవర్' కోర్సు 73వ బ్యాచ్‌లో శిక్షణ పొందేందుకు గానూ అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నామని మత్స్యశాఖ అదనపు సంచాలకులు టి.సుమలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి నుండి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తు చేయవచ్చు. శిక్షణా కాలం ఈ ఏడాది సెప్టెంబర్ 01 నుంచి ప్రారంభం అయి ఒక సంవత్సర కాలం పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పద్ధతులతో యంత్రపు నావ / బోటులో చేపల వేటలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు, సంబంధిత సెర్టిఫికెట్‌లు నకళ్ళను జతపరిచి ఆగస్టు 10 వతేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను ఆయా జిల్లాల మత్స్యశాఖ అధికారి వారి కార్యాలయంలో నేరుగా అందజేయవచ్చని, లేక పోస్టల్ ద్వారా పంపించవచ్చని ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 23 తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ, జగన్నాథపురం, కాకినాడ-2 కార్యాలయంలో సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. దరఖాస్తు నమూనా, పూర్తి వివరాలకు వెబ్‌సైట్ నుండి పొందవచ్చని తెలిపారు.

## ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లకు ఆదరణ

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ఫోల్డబుల్స్ విపరీతంగా పెరుగుతున్న మార్కెట్లలో భారతీయ మార్కెట్ ఒకటని, ఈ వృద్ధిలో అత్యంత కీలకంగా గెలాక్సీ ఫోల్డబుల్స్ ఉన్నాయని శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ మొబైల్ ఎక్స్‌పీరియన్స్ బిజినెస్ ప్రెసిడెంట్, హెడ్‌టిఎం రోహ్ అన్నారు. నగరంలోని శాంసంగ్ షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది మార్కెట్ డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. మరీ ముఖ్యంగా ఫోల్డబుల్స్ కోసం మెరుగైన రీతిలో గెలాక్సీ ఎఐను అందించటంతో భారతీయ కస్టమర్లు కొత్త గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6, కొత్త గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6ని స్వీకరించడంపై తమకు అధిక అంచనాలు ఉన్నాయని తెలిపారు. శాంసంగ్ ఇటీవల విడుదల చేసిన గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ 6 ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లు, మునుపటి తరం ఫోల్డబుల్ ఫోన్లతో పోలిస్తే కేవలం 24 గంటల్లో 40 శాతం అధిక ప్రీ ఆర్డర్లను నమోదు చేశాయన్నారు.

# బూడిద కాల్వలో పడి బాలుడు మృతి

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** ఇంటిముందు ఆడుకుంటూ బూడిద కాల్వలో పడి మూడేళ్ల బాలుడు మృతిచెందిన హృదయవిదార ఘటన మండలంలోని ఖిల్లారోడ్డులో చోటుచేసుకుంది. స్తానికుల కథనం ప్రకారం... ఖిల్లా రోడ్డులో నివాసం ఉంటూ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న భూక్యా కుమార్, లక్ష్మి కుమారుడు సిద్ధార్థ్ నాయక్ ఇంటి ముందు ఆడుకుంటూ అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించగా ఇబ్రహీంపట్నం సిఐ ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. బాబు మృతదేహాన్ని స్థానిక నిమ్రా కాలేజ్ గేటు ఎదురుగా కాలువలో గుర్తించి వెలికితీశారు. అనంతరం కుటుంబ సభ్యులకు బాబు మతదేహాన్ని అప్పగించారు. అప్పటి వరకు ఆడుకుంటున్న కుమారుడు మృతిచెందడంతో కుటుంబీకులు గుండెలు పగిలేలా రోధించిన తీరు చూపరులను సైతం కన్నీరు పెట్టించింది. విటిపిఎస్ బూడిద కాల్వలో బూడిద నీరు ప్రవాహం అధికంగా ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం : బాలుడి తల్లి**

అధికారుల నిర్లక్ష్యంతోనే తన కుమారుడు మరణించాడని సిద్ధార్థ నాయక్ తల్లి లక్ష్మి ఆరోపించారు. కాలువ లోతు తగ్గించాలని, కాలువ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోకపోవడం వల్లే తన కుమారుడు మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ బూడిద చెరువు నుండి నిత్యం బూడిద నీటితో కాలువ ప్రవహిస్తుంది. కొన్నిసార్లు పైపులు పగిలి కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. కాలువ ఉప్పొంగి రోడ్డు పైకి బూడిద నీరు వచ్చిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. సంఘటన విషయం తెలియగానే కాలువ ఉధృతిని తగ్గించి చేతులు దులుపుకున్నారు.


బాలుడి మృతితో రోధిస్తున్న తల్లి, కుటుంబీకులు


అధిక ప్రవాహంతో ఉన్న బూడిద కాల్వ

# మధుమేహ వ్యాధిగ్రస్తులు కంటి జాగ్రత్తలు తీసుకోవాలి

### డాక్టర్ ఆదిత్య కపూర్



**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :** మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ కళ్ల పట్ల మరింత జాగ్రత్తలు వహించాలని, ఒకవేళ మధుమేహం కలిగి ఉంటే కంటి పరీక్షలు చేయించుకోవాలని. ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ ఆదిత్య కపూర్ అన్నారు. విజయవాడ కోడె వెంకటాద్రి చౌదరి ప్రాంగణం ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ ఆదిత్య కపూర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మధుమేహ (డయాబెటిక్స్) వ్యాధి కలిగిన వారిలో 17 శాతం మంది భారతదేశంలోనే ఉన్నారన్నారు. సుమారు 77 మిలియన్ల మంది భారతీయులు మధుమేహంతో బాధపడుతున్నట్లు గుర్తించారని, ఈ సంఖ్య 2045 నాటికి 125 మిలియన్లకు చేరవచ్చని భావిస్తున్నారన్నారు. డయాబెటిక్ రెటినోపతి అనేది కళ్ళను ప్రభావితం చేసే ఒక తీవ్రమైన సమస్యగా పేర్కొన్నారు. దీనికి సకాలంలో చికిత్స అందించకపోతే దృష్టిని కోల్పోవచ్చన్నారు. చక్కెర స్థాయి రక్తంలో ఎక్కువ కావటం వలన రెటీనా రక్త నాళాలు దెబ్బతినటం వల్ల కాంతిని గ్రహించే శక్తిని కోల్పోతాయన్నారు. డయాబెటిక్ రెటినోపతి అనేది ఎలాటి లక్షణాలు కనిపించకుండా వృద్ధి చెందుతుందని, ముందస్తు చికిత్స ద్వారా నివారించొచ్చన్నారు. డయాబెటిస్ ఉన్న వారు ప్రతి సంవత్సరం కంటి పరీక్షలు చేయిం చవలసి ఉంటుందన్నారు. అయితే వ్యాధి తీవ్రతను బట్టి తరచుగా కంటి పరీక్షలు చేయాల్సి ఉంటుందని, గర్భిణులు మొదటి త్రైమాసికంలో (3వ నెలలో) సమగ్ర నేత్ర పరీక్షలు చేయించుకోవటం చాలా అవసరమన్నారు. డయాబెటిక్ రెటినోపతికి ఎల్వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంట్రావిట్రియల్ ఇంజెక్షన్లు, లేజర్ ఫోటోకోగ్యులేషన్, అవసరమైతే శస్త్రచికిత్స చేసే వ్యవస్థ అందుబాటులో ఉందని తెలిపారు.

### విజయవాడ, కేతనకొండలో

# అలనాటి రామచంద్రుడు సందడి

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :**

ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ ఆర్కే ఇంజనీరింగ్ కళాశాలలో 'అలనాటి రామచంద్రుడు' చిత్రం ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణయ్య సినిమా డైరెక్టర్, మిగిలిన నటీనటులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించారు. ప్రమోషన్‌లో భాగంగా సినిమా డైరెక్టర్ చిలుకూరు ఆకాష్ రెడ్డి హీరో కృష్ణవంశీ హీరోయిన్ మోక్ష తదితరులు పాల్గొని వారి సినిమాను ఆదరించాలని విద్యార్థులను కోరారు. మూవీ ట్రైలర్‌ను ప్రదర్శించారు. అనంతరం హీరో హీరోయిన్లు చేసిన డాన్స్ ఆకట్టుకుంది. ఆగస్ట్ రెండో తేదీన ప్రపంచ వ్యాప్తంగా సినిమాను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిన్న కాంటెస్ట్ పెట్టి వాటిలో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి సినిమాకి సంబంధించిన టీషర్టు క్యాప్లు బహుమతులుగా అందించారు. సినిమా డైరెక్టర్ ఆకాశరెడ్డి మాట్లాడుతూ సినిమాని థియేటర్లో మాత్రమే చూసి ఆనందించాలని పైరసీకి తావివ్వొద్దని ఇటువంటి చిన్న సినిమాలను ఆదరించి ప్రోత్సహిస్తే ఇంకా మంచి సినిమాలు చేసే అవకాశం వస్తుందని విన్నవించారు. హీరో హీరోయిన్లు విద్యార్థుల్లో జోష్ నింపడానికి సినిమా పాటలకు నృత్యం చేశారు. ఈ అవకాశాన్ని కల్పించిన ఆర్‌కె కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎమ్ఎమ్ కొండయ్యకు,సెక్రటరీ ఎమ్ మహేంద్ర నాథ్‌కి, ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

**విజయవాడ అర్బన్ :** నగరంలో అలనాటి రామచంద్రుడు చిత్ర యూనిట్ సందడి చేసింది. అద్భుతమైన ప్రేమ కావ్యాన్ని ఆగస్టు రెండున ప్రేక్షకుల ముందుకు తీసుకురాన్నామని ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని హీరో కష్ణవంశీ కోరారు. బందర్ రోడ్ లోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర హీరో కష్ణవంశీ మాట్లాడుతూ తెలుగులో తాను అలనాటి రామచంద్రుడు చిత్రంతో చిత్రసీమకు హీరోగా పరిచయం అవుతున్నట్లు తెలిపారు. దర్శకుడు ఆకాష్ ఈ చిత్రాన్ని ఒక అద్భుతమైన ప్రేమ కావ్యంగా మలిచారని తెలిపారు. ఈ చిత్రంలో పాటలు వినసొంపుగా ఉంటాయని చెప్పారు ప్రముఖ నిర్మాత దిల్ రాజ్ తమ చిత్రాన్ని రిలీజ్ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం హీరోయిన్ మోక్ష మాట్లాడుతూ లక్కీ లక్ష్మణ్ చిత్రంతో తెలుగు చిత్రసీమలో అడుగు పెట్టినట్లు తెలిపారు. అలనాటి రామచంద్రుడు చిత్రంలో హీరోయిన్గా నటించే అవకాశం దర్శకుడు ఆకాష్ కల్పించారని చెప్పారు. తథనంతరం దర్శకుడు ఆకాష్ మాట్లాడుతూ అలనాటి రామచంద్రుడు చిత్రంతో తాను దర్శకుడిగా వెండితెరకు పరిచయం అవుతున్నానని చెప్పారు. విలేకరుల సమావేశంలో నటీమణులు దివ్యశ్రీ, స్నేహ పాల్గొన్నారు.



విజయవాడలో...



ఇబ్రహీంపట్నంలో కళాశాల విద్యార్థులతో డ్యాన్స్ చేస్తున్న హీరో హీరోయిన్లు

## 25 న అండర్ - 7 చెస్ టోర్నమెంట్

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** ఈ నెల 25న విజయవాడ కానూరు గాంధీ బొమ్మ సెంటర్లో గల ది ఐ ప్లే స్కూల్‌లో కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా అండర్ 7 బాల బాలికల చెస్ సెలక్షన్ టోర్నమెంట్ జరుగుతుందని స్కూల్ డైరెక్టర్ కె.సంధ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్లో సెలెక్ట్ అయిన బాలురిద్దరినీ బాలికల్లో ఇద్దరిని కృష్ణా జిల్లా తరఫున ఆగస్టు 3,4 తేదీల్లో విజయనగరంలో జరిగే ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ బాలబాలికల చెస్ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ టోర్నమెంట్ ఆడేవారు బుధవారం సాయంత్రం ఆరు గంటల లోపు తమ పేర్లను ఏపీ చెస్ వెబ్‌సైట్లో నమోదు చేసుకోవాలని ది ఐ ప్లే స్కూల్ డైరెక్టర్ కె.సంధ్య తెలిపారు. మరిన్ని వివరాలకు 9700775220/ 9391279088 సంప్రదించగలరని అన్నారు.


వృద్ధునికి సపర్యలు చేస్తున్న ఎస్ఐ

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి - నందిగామ :**

నందిగామ పోలీసు స్టేషను సమీపంలో సిఎం రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. సిఎం రోడ్లో పోలీస్ స్టేషన్ దగ్గరలో ముప్పాళ్ళ గ్రామానికి చెందిన నల్లాని సైదులు బైక్ ఫ్రంట్ బ్రేక్ కొట్టడంతో జారి కింద పడిపోయింది. బైక్ మీద నుండి కింద పడిన నల్లాని సైదులుకు కాలు విరిగింది. ఎస్ఐ పండు దొర, సిపిఎం నందిగామ పట్టణ కమిటీ సభ్యులు కర్రి వెంకటేశ్వర రావు, ఎవి నారాయణ వృద్ధుడిని ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ పండు దొర వృద్ధుడి పట్ల తీసుకున్న శ్రద్ధపై సిపిఎం నాయకులు, పలువురు ప్రశంసలు వ్యక్తం చేశారు.

## గజపతినగరం ఎంఎల్ఎ అతిథిని కలిసిన బుద్దా వెంకన్న

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** గజపతినగరం శాసనసభ్యురాలు, పూసపాటి అశోక్ గజపతి రాజు తనయురాలు అతిథిని విజయవాడలో ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మంగళవారం ఆమె నివాసంలో వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు.